PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక :135 | విజయవాడ, మంగళవారం 17 డిసెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 17 December 2024 | Rs

అదాని, అంబానిల నుండి అడవిని కాపాడుకోవాలి

- పోలవరం నిర్వాసితుల ఉద్యమం ఉధృతం
- సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రథమ మహాసభలో వి శ్రీనివాసరావు

3



పోలవరంలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

పౌర ఆధారిత జాతీయవాదంతోనే

దేశ ఐక్యత సాధ్యం

- ఆ విధంగా సాంస్కృతిక రంగం కృషి చేయాలి
- ఎంబి స్మారకోపన్యాసంలో ఎస్‌వికె చైర్మన్ రాఘవులు



సభలో మాట్లాడుతున్న బివి రాఘవులు, చిత్రంలో మధు, మురళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశం సమైక్యంగా ఉండాలంటే అందరికీ పౌర ఆధారిత జాతీయవాదం కావాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం(ఎస్‌వికె) చైర్మన్ బివి రాఘవులు అన్నారు. ప్రజలందరీ సహకారం, సమిష్టితత్వం, సంతోషంగా ఉండే భావాలను వ్యాప్తి చేయడమే పౌర జాతీయవాదమన్నారు. దేశంలో ఉన్నవారిని పౌరులుగా గుర్తించి ఆ ప్రాతిపదికన దేశాన్ని ఐక్యంగా ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. అటువంటి భావజాలాన్ని ముందుకుతీసుకెళ్లేందుకు సాంస్కృతిక రంగం కృషి చేయడమే మాకినేని బసవపున్నయ్య(ఎంబి) వంటి నేతలకు ఇచ్చే నివాళి అని అన్నారు. ఎంబి 112వ జయంతి సందర్భంగా 'సాంస్కృతిక వైవిధ్యం-దేశ సమైక్యత' అనే అంశంపై స్మారక ఉపన్యాసం ఎంబి విజ్ఞాన కేంద్రంలోని చుక్కపల్లి ఆడిటోరియంలో సోమవారం జరిగింది. ఎంబివికె ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆ ట్రస్ట్ చైర్మన్ పి మధు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ఏర్పడిన సామ్రాజ్యవాద జాతీయభావం దేశ ప్రజలందరీని సమైక్యంగా ఉంచిందన్నారు. ఇప్పుడు బిజెపి హిందూ మత ఆధారిత జాతీయ వాదం ఉండాలని చెబుతోందని, మరి ఇతర మతాల సంగతేంటని ప్రశ్నించారు. అందరూ ఐక్యంగా ఉండాలంటే దేశ పౌరులమనే చెప్పుకోవాలే తప్ప కులాలు, మతాలు కాదన్నారు. మత ఆధారిత జాతీయవాదం దేశానికి ప్రమాదకరమని చెప్పారు. 1985లో షాబాన్ బేగం కేసులో భరణం ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చిందని, అప్పటి ప్రధానమంత్రిగా ఉన్న రాజీవ్ గాంధీ భరణం ఇవ్వాల్సిన అవసరం లేదనే చట్టం తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇస్లాం మతంలో ఉన్న మతోన్మాదుల ఒత్తిడికి తలొగ్గి వారిని సంతృప్తి పరిచేందుకు రాజీవ్‌గాంధీ ప్రయత్నించారని తెలిపారు. బాబ్రీ మసీద్ తాళాలు తీసి హిందూ మతోన్మాదులను సంతృప్తిపరిచారని తెలిపారు. రాజ్యాన్ని మతంలో జోక్యం చేసుకునేందుకు ఉపయోగించి ఇరు మతోన్మాదులను సంతృప్తిపరిచారని చెప్పారు. దేశ ఐక్యతకు ఇది చాలా ప్రమాదకర పరిణామం అని,దీనికి రాజీవ్ గాంధీ పునాది వేస్తున్నారని 1986లోనే బసవపున్నయ్య ఒక వ్యాసం రాశారని గుర్తుచేశారు. లౌకికతత్వం నాశనమవ్వడానికి దారితీస్తుందని, లౌకికవాదం లేకపోతే దేశ సమైక్యతను కాపాడటం కష్టమని ఎంబి రాశారని చెప్పారు. అన్ని మతాలను సమానంగా చూడటం లౌకికవాదం కాదన్నారని తెలిపారు. ప్రజలు వారి సంస్కృతిని, మతాన్ని అనుసరిస్తారని, ప్రత్యేకంగా వారిపై ఒత్తిడి చేసి చెప్పాల్సిన అవసరం లేదని చెప్పారని గుర్తుచేశారు. మతం రాజ్యాలకు సంబంధం లేదని,వ్యక్తులు, సమూహాలకు వదిలేయాలని అన్నారు. మతాన్ని అధిగమించి భాషకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. ప్రాంతీయ అసమానత ఆధారంగా ఎపి, తెలంగాణ రాష్ట్రాలు గొడవపడి విడిపోయాయని తెలిపారు. పౌర ఆధారిత జాతీయ భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో సాంస్కృతిక రంగం కీలకపాత్ర పోషించాలని చెప్పారు. పి మధు మాట్లాడుతూ ప్రార్థన స్థలాలు ఎలా ఉన్నాయో, అలానే ఉంచాలని 1991లో పార్లమెంట్ తీసుకొచ్చిన చట్టానికి వ్యతిరేకంగా న్యాయవ్యవస్థను ఉపయోగించి మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు మత శక్తులు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ఈ చట్టాన్ని అమలు చేసేందుకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ చట్టంలో ఉన్న స్ఫూర్తితో ఏ ప్రార్థన మందిరాలు, ఆలయాల జోలికెళ్లకుండా మత సామరస్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర పోరాటంలో పాల్గొనడంతో పాటు కుల వివక్షకు వ్యతిరేకంగా కూడా బసవపున్నయ్య కృషి చేశారని చెప్పారు. ఈ ఏడాది ఎంబి విజ్ఞాన కేంద్రం నిర్వహించిన వివిధ కార్యకలాపాల నివేదికను కార్యదర్శి పి మురళీకృష్ణ చదివి వినిపించారు. కార్యక్రమానికి ముందు ప్రజానాట్యమండలి కళాకారులు గేయాలను ఆలపించారు.

ప్రస్తుతానికి

41.15 మీటర్లకే

పోలవరం పనులు, పునరావాసంపై సిఎం చంద్రబాబు

మిగిలిన పనుల కోసం కేంద్రానికి లేఖ

2026 అక్టోబర్‌కు పూర్తి చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు, పునరావాసం పనులను ప్రస్తుతానికి 41.15 మీటర్ల ఎత్తుకే పరిమితం చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. సోమవారం పోలవరం ప్రాజెక్టును ఆయన సందర్శించారు. డయాఫ్రం వాల్ వద్ద ఇసుక గ్రౌటింగ్, కాఫర్ డ్యామ్‌లను పరిశీలించారు. పోలవరం కార్యాలయంలో అధికారులు, మంత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుకు సంబంధించి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన లేఖ ఆధారంగా 41.15 మీటర్ల ఎత్తుకే పోలవరం ప్రాజెక్టును పరిమితం చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. అందువల్ల నిధులు కూడా అంతవరకే ఇచ్చిందని అన్నారు. ఇది గత ప్రభుత్వంచేసిన తప్పిదమని ఆయన చెప్పారు. ప్రాజెక్టును పూర్తిస్థాయి ఎత్తుకు (45.72 మీటర్లు)కు నిర్మాణం చేయాలంటే కేంద్ర ప్రభుత్వానికి మళ్లీ లేఖ రాసి అనుమతి తీసుకోవాల్సి ఉందని అన్నారు. తొలుత అనుమతులున్నంతవరకు ప్రాజెక్టు, పునరావాసం పనులు పూర్తి చేసి, ఆ తరువాత 45.72 మీటర్లకు ప్రాజెక్టును తీసుకుపోతామన్నారు. ఈ మేరకు కేంద్రానికి త్వరలోనే లేఖరాస్తామని చెప్పారు. అనుమతులున్నంతవరకు ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ 2026 అక్టోబర్ నాటికి పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ నిపుణుల కమిటీ, కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీతో ఇదే విషయానిన చర్చించామని చెప్పారు.

ముంపుపై మళ్లీ సర్వే లేదు

నిర్దేశించిన దానికంటే ఎక్కువ ప్రాంతాలు మునకకు గురవుతున్నందువల్ల మరోసారి సర్వే నిర్వహిస్తారా అంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి జవాబిస్తూ 'అటువంటిదేమి లేదు' అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లెక్కలు కరక్టుగానే ఉన్నాయని చెప్పారు.

పొరుగు రాష్ట్రాల్లో ముంపునకు సంబంధించి వ్యక్తమవుతున్న ఆందోళనలను ప్రస్తావించగా 'అది అంతర్రాష్ట్రాల వ్యవహారం... అందువల్ల కేంద్రం పరిధిలో ఉంది' అని చెప్పారు.

జనవరి 2 నుండి డయాఫ్రం వాల్ పనులు

డయాఫ్రం వాల్, ఇసిఆర్ఎఫ్ నిర్మాణ పనులను సమాంతరంగా చేపట్టవచ్చని నిపుణులు సూచించారన్నారు. దెబ్బతిన్న డయాఫ్రం వాల్ పనులస్థానంలో కొత్త డయాఫ్రం వాల్ పనులను జనవరి రెండోతేదీన చేపడుతున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు సివిల్ పనులను 2026 మే, జూన్ నాటికి పూర్తి చేస్తే ఒకసీజన్‌ను కోల్పోకుండా ఉంటామని, 2026 నుండి ప్రాజెక్టులో నీరు నిల్వ ఉండేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను కోరామని పేర్కొన్నారు. ప్రాజెక్టు కుడికాల్వ, ఎడమకాల్వ కనెక్టివిటీ, స్పిల్ ఛానెల్ పనులు 2026 జూన్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.. టిడిపి ప్రభుత్వ హయాంలో 72 శాతం పనులు పూర్తిచేస్తే వైసిపి 3.84 శాతం పనులు మాత్రమే పూర్తి చేసిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల రూ.2400 కోట్లు దుర్వినియోగం అయ్యాయని పేర్కొన్నారు.

భూసేకరణకు సమర్థవంతమైన అధికారి

పోలవరం ఐకానిక్ ప్రాజెక్టు భూసేకరణకు సమర్థవంతమైన అధికారిని నియమిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. మంత్రులు, అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడుతూ పనులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు. ఇరిగేషన్ అధికారులు, మెగా కంపెనీ ప్రతినిధులు సాంకేతిక పరమైన అంశాలను గుర్తించి ఖచ్చితత్వంతో కూడిన నిర్దిష్ట కాలంలో పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. వీలైనంత త్వరగా ప్రాజెక్టుకు లెఫ్ట్, రైట్ కెనాల్స్ అనుసంధానం చేసే పనిచేపట్టాలన్నారు. పనులు, పునరావాసం విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకే పనులు జరగాల్సి ఉందని అన్నారు. ఈ సమీక్షలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ప్రాజెక్టు సలహాదారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాడు అంబేద్కర్ దిష్టిబొమ్మలు దగ్ధం చేసిన వాళ్లే

నేడు సుద్దులు చెబుతున్నారు

- రాజ్యసభలో మల్లికార్జున్ ఖర్గే ఆగ్రహం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

త్రివర్ణ పతాకం, అశోక చక్రం, రాజ్యాంగాన్ని ద్వేషించిన వాళ్లు.. నేడు రాజ్యాంగం గురించి పాఠాలు చెబుతున్నారని రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యసభలో సోమవారం ప్రత్యేక చర్చ ప్రారంభమైంది. ఈ చర్చలో మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజు.. ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో గాంధీ, నెహ్రూ, బిఆర్ అంబేద్కర్ దిష్టిబొమ్మలను ఆర్ఎస్ఎస్ వ్యక్తులు తగలబెట్టారని గుర్తు చేశారు. మనుస్మృతి ఆధారంగా లేదంటూ భారత రాజ్యాంగంతో పాటు త్రివర్ణ పతాకాన్ని సైతం ఆర్ఎస్ఎస్ వ్యతిరేకించిందని వివరించారు. 2002 జనవరి 26 వరకు జాతీయ జెండానే ఎగురవేయలేదని, తప్పనిసరి పరిస్థితుల్లో ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారని ఖర్గే గుర్తు చేశారు. నెహ్రూ, ఇందిరాగాంధీలను బిజెపి కించపరుస్తున్నదని, ఆ పార్టీ పాలనలో ప్రజ్వాస్వామ్యం ప్రమాదంలో పడిందని అన్నారు. బిజెపి విభజన సూత్రాన్ని నమ్ముతున్నదని, కానీ ప్రజలకు కావాల్సింది మాత్రం స్వేచ్ఛ, సమానత్వమని చెప్పారు. దేశం కోసం బిజెపి నేతలు ఎప్పుడూ పోరాటం చేయలేదని, అలాంటి వ్యక్తులు నెహ్రూ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. బిజెపి రాజ్యాంగానికి అనుకూలమా.. వ్యతిరేకమా..? అని ప్రశ్నించారు. జాతీయ జెండాను, రాజ్యాంగాన్ని బిజెపి ఏనాడు గౌరవించలేదని, అలాంటి వాళ్లు ఇప్పుడు రాజ్యాంగం గురించి మాకు పాఠాలు చెబుతుండటం వింతగా ఉందని ఎద్దేవా చేశారు. రాజ్యాంగం బలోపేతానికి గత 11 ఏళ్లలో ప్రధాని మోడీ ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. బిజెపి నేతలు అబద్ధాలతో దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పెద్ద వాషింగ్ మెషిన్ కొన్నారని, ఆ వాషింగ్ మెషిన్‌లోకి ఎవరు వెళ్లినా పరిశుద్ధమై బయటికి వస్తారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష పార్టీల్లో ఉన్న నాయకులపై అవినీతి ముద్రవేస్తున్నారని, వారు బిజెపిలో చేరగానే నీతిమంతులుగా మారుతారని విమర్శించారు. 'మిమ్మల్ని కేవలం ఒక రాష్ట్రమో, ప్రాంతమో ఓటేయలేదు. మీరు ఇతర ప్రాంతాలపై ప్రతీకారం తీర్చుకోవడం తగదు' అని హితవు పలికారు.

'ప్రధాని మోడీ ఎన్నికలు ఎక్కడుంటే అక్కడికే వెళ్తారు. కానీ మణిపూర్‌కు వెళ్లేందుకు మాత్రం ఇష్టపడటం లేదు' అని విమర్శించారు. రాహుల్‌గాంధీ మణిపూర్‌కు వెళ్లారని, అక్కడ యాత్ర చేశారని ఖర్గే గుర్తు చేశారు. ప్రధానికి కావాల్సినంత భద్రత ఉంటుందని, అయినా ప్రధాని మాత్రం మణిపూర్‌కు వెళ్లేందుకు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇన్ని రోజులవుతున్నా మణిపూర్‌లో పరిస్థితి మీరు ఎందుకు చక్కదిద్దడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యు) నుంచి గ్రాడ్యుయేట్ పట్టా తీసుకున్నారని, తాను మాత్రం మున్సిపాల్టీ స్కూల్‌లోనే చదువుకొన్నానని గుర్తు చేశారు. ఆమె ఇంగ్లీష్, హిందీలో మాట్లాడే విధానం చాలా బాగుందని, కానీ.. ఆమె చర్యలు ఏ మాత్రం బాగోలేదని అన్నారు.


రాజ్యాంగాన్ని కాంగ్రెస్ అగౌరవ పరిచింది : నిర్మలా సీతారామన్

పదవుల కోసం రాజ్యాంగాన్ని కాంగ్రెస్ అగౌరవ పరిచిందని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ విమర్శించారు. రాజ్యాంగంపై చర్చను మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో సోమవారం ప్రారంభించారు. కేవలం కుటుంబ లబ్ధి కోసమే కాంగ్రెస్ రాజ్యాంగ సవరణలు చేసిందన్నారు. ముస్లిం మహిళలకు భరణాన్ని సైతం ఇవ్వకుండా చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో పలు రాజకీయ పార్టీల నాయకులు జైళ్లో మగ్గేవారని అన్నారు. అందుకోసం సవరణలు చేసి మరీ నాయకులను జైల్లో పెట్టిన సందర్భాలున్నాయని ఆరోపించారు.



లోక్‌సభకు పాలస్తీనా బ్యాగ్‌తో ప్రియాంక గాంధీ

కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ సోమవారం పార్లమెంట్ సమావేశాలకు 'పాలస్తీనా' అని రాసివున్న ఒక ప్రత్యేక బ్యాగుతో హాజరయ్యారు. గాజాపై ఇజ్రాయిల్ చర్యను వ్యతిరేకిస్తూ పాలస్తీనీయులకు సంఘీభావం ప్రకటించారు.



భారత్, శ్రీలంక

ఆర్థిక భాగస్వామ్యం విస్తరణ

ప్రధాని మోడీ, శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకె నిర్ణయం

న్యూఢిల్లీ : భారత్, శ్రీలంక మధ్య భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు భవిష్యత్ ప్రణాళికను రెండు దేశాలు సోమవారం ఆమోదించాయి. త్వరలో రక్షణ సహకార ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని కూడా తీర్మానించాయి. విద్యుత్ గ్రిడ్‌ల అనుసంధానత, బహుళ ఉత్పత్తుల పెట్రోలియం పైప్‌లైన్ల ఏర్పాటు ద్వారా ఇంధన సంబంధాలను పెంచుకోవాలని నిర్ణయించాయి. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం న్యూఢిల్లీ చేరుకున్న శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకె సోమవారం ప్రధాని నరేంద్ర మోడీతో సమావేశమయ్యారు. ఇరువురు నేతలు విస్తృతాంశాలపై చర్చలు జరిపి ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. రెండు దేశాల మధ్య ఆర్థిక భాగస్వామ్యం కోసం పెట్టుబడి ఆధారిత వృద్ధిని పెంపొందించడంపై, అనుసంధానతపై దృష్టి సారించాలని ఉభయ పక్షాలు

మిగతా 7లో

సమన్వయమే కీలకం

- బహిరంగ వ్యాఖ్యలు వద్దు
- బాబు, పవన్ భేటీలో నిర్ణయం
- పలు ఇతర అంశాలపై చర్చ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి-జనసేన నేతల మధ్య ఆధిపత్య పోరు సాగుతోందంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో రెండు పార్టీల మధ్య మరింతగా సమన్వయాన్ని పెంచుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించినట్లు తెలిసింది. సచివాలయంలో ఈ ఇరువురు నేతలు సోమవారం సమావేశమైనారు. పోలవరం పర్యటన ముగించుకుని సచివాలయానికి వచ్చిన చంద్రబాబు అప్పటికే అక్కడ వేచిచూస్తున్న పవన్ కల్యాణ్‌తో బభేటీ అయ్యారు. ఈ సమావేశం దాదాపు 40నిమిషాలు సాగింది. తాజా రాజకీయ పరిస్థితులు, కూటమి పార్టీల మధ్య సమన్వయం, తన శాఖల పరిధిలోని పనులకు సంబంధించి పురోగతి తదితర అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలిసింది. టిడిపి, జనసేన నేతల మధ్య ఆదిపత్య పోరు జరుగుతోందంటూ వస్తున్న వార్తల ప్రస్తావన కూడా ఇరువురి నేతల మధ్య వచ్చినట్లు తెలిసింది. సమన్వయాన్ని మరింతగా పెంచుకోవడంతో పాటు, ఈ అంశాలపై బహింరంగంగా ఎటువంటి వ్యాఖ్యలు చేయకూడదని నిర్ణయించినట్లు సమాచారం. రెండు పార్టీలకు చెందిన నేతలు దీనికి ఖచ్చితంగా పాటించేలా చూడాలని అనుకున్నట్లు తెలిసింది. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబును రాష్ట్ర మంత్రివర్గంలోకి ఎప్పుడు తీసుకుంటారన్న విషయంపైకూడా సమావేశంలో చర్చ జరిగింది. ఇటీవల జరిగిన సాగు నీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అధిక సంఖ్యలో విజయం సాధించడంపైన ఇరువురు హర్షం వ్యక్తం చేశారు. సహకార సంఘాల ఎన్నికల్లోనూ ఘన విజయం దిశగా అడుగురు వేయాలని నిర్ణయించారు. నామినేట్ పోస్టుల భర్తీకి సంబంధించి త్వరలో తుది జాబితా విడుదల చేసే అవకాశం ఉండటంతో ఈ పోస్టుల్లో జనసేనకు కేటాయించే వాటి గురించి చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది.

విశ్వాస పరీక్షలో జర్మనీ ఛాన్సలర్ స్కోల్జ్ ఓటమి

బెర్లిన్ : జర్మనీ పార్లమెంట్‌లో సోమవారం జరిగిన విశ్వాస పరీక్షలో ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ ఓటమి చవిచూశారు. మొత్తం 733 మంది సభ్యులు ఉన్న దిగువ సభలో ఓలాఫ్ స్కోల్జ్‌కు అనుకూలంగా కేవలం 207 మంది మాత్రమే ఓటు వేశారు. వ్యతిరేకంగా 394 మంది ఓటు వేశారు. మరో 116 మంది సభ్యులు గైర్హాజరయ్యారు. దీంతో గెలవడానికి అవసరమైన 367 మెజార్టీకి స్కోల్జ్ చాలా దూరంలో నిలిచారు. నవంబర్ 6న మూడు పార్టీల కూటమి ప్రభుత్వం కుప్పకూలిన నేపథ్యంలో ఈ విశ్వాస పరీక్ష నిర్వహించారు. నవంబర్ 6న వివిధ పార్టీల నాయకులు ఏడు నెలల ముందుగానే అంటే ఫిబ్రవరి 23న పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించడానికి అంగీకరించారు. స్కోల్జ్ ఓటమితో ఈ ఎన్నికలు మరింత ముందుగా జరిగే అవకాశం ఉంది. స్కోల్జ్ ఓటమితో పార్లమెంట్‌ను రద్దుచేసి ఎన్నికలను నిర్వహించాలా.. వద్దా అనేది అధ్యక్షులు ఫ్రాంక్-వాల్టర్ స్టెయిన్‌మీర్ నిర్ణయం తీసుకోనున్నారు. ఇందుకోసం అధ్యక్షుల ముందు 21 రోజుల సమయం ఉంది.

కాలపరిమితి సర్క్యులర్ రద్దుపై

త్వరలో మంత్రితో చర్చలు

ఎపి వెలుగు విఓఎ(యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విఓఎల ఉపాధికి ఎసరు తెస్తున్న కాలపరిమితి సర్క్యులర్ రద్దుపై త్వరలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో చర్చలు జరిగే విధంగా కృషిచేస్తామని సెర్ప్ సిఇఓ వీరపాండియన్ తమకు హామీ నిచ్చినట్లు ఎపి వెలుగు విఓఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) పేర్కొంది. సోమవారం సాయంత్రం సిఇఓ తమతో విఓఎల సమస్యలపై చర్చించినట్లు తెలిపారు.. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.10 లక్షలు అమలు విషయం పరిశీలించి న్యాయం చేస్తామని, కోర్టు ఉత్తర్వులు అమలు జరిగేట్లు చర్యలు తీసుకుంటామని సిఇఓ హామీ ఇచ్చినట్లు వెలుగు విఓఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి పేర్కొన్నారు. అంతకు ముందు విజయవాడ ధర్నా చౌక్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రూపాదేవి అధ్యక్షతన సభజరిగింది. సభలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ రోజు రోజుకీ విఓఎల పైన పనిభారం పెంచుతూ మానసిక వేదనకు గురి చేస్తున్న ప్రభుత్వ విధానాలను వెంటనే మార్చాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోజుకో రకమైన యాప్‌తో విఓఎల జీవితాలతో అధికారులు ఆటలాడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



ధర్నా చౌక్‌లో ఆందోళన చేస్తున్న యానిమేటర్స్

ప్రభుత్వాలు మారినప్పుడల్లా వేలాదిమందిని ఉద్యోగాల నుంచి తొలగించడం పరిపాటిగా మారిందన్నారు. అన్యాయంగా ఉద్యోగాల నుంచి తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు కె.ఉమామహేశ్వం రావు, ఆర్‌వి నరసింహారావు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి 7నెలలు గడుస్తున్నా ఉద్యోగులు, కార్మికులు సమస్యల పరిష్కారానికి ఏ మాత్రం కృషి చేయడం లేదని విమర్శించారు. విఓఎల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం జరుగుతున్న పోరాటానికి సిఐటియు, అనుబంధ సంఘాల తరపున మద్దతు ప్రకటించారు. విఓఎల సంఘ నాయకులు ఎ.తిరుపతయ్య, నిర్మలమ్మ, సోమన్న, గుంటప్ప, అసిరి నాయుడు, ఆర్ భాను, ఎ.కమల, కృష్ణమ్మ, రాజశేఖర్, సుభాషిణి, గంగా భవాని, పి.వెంకటలక్ష్మి, స్వరూప ధర్నారావు ప్రసంగించారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 0-6 సంవత్సరాల చిన్నారుల ఆధార్ నమోదు కోసం ప్రభుత్వం స్పెషల్ ఆధార్ సెంటర్లు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 17 నుంచి 20 వరకు, మరలా 26 నుంచి 28వ తేదీ వరకు అంగన్‌వాడీ సెంటర్లలో ఆధార్ నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆయా జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆధార్ నమోదు కాని చిన్నారులు 11,65,264 మంది ఉండగా, ఇటీవల నిర్వహించిన ఆధార్ క్యాంపుల్లో 64,441 మంది చిన్నారులకు ఆధార్ నమోదు చేశారు. ఇంకా రాష్ట్ర వ్యాప్తంగా 11,00,823 మంది చిన్నారుల ఆధార్ నమోదు చేయాల్సి ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. వీలైనంత ఎక్కువ మంది చిన్నారుల ఆధార్, బయోమెట్రిక్ నమోదు చేయాలని జిఎస్‌డబ్ల్యుఎస్, డిఎల్‌డిఒలు తప్పనిసరిగా మానిటరింగ్ చేసి లక్ష్యాలను అధిగమించాలని జిఎస్‌డబ్ల్యుఎస్‌శాఖ డైరెక్టర్ ఎం శివప్రసాద్ పేర్కొన్నారు.

విద్యుత్ ఒప్పందాలపై కోర్టుకు వెళ్తాం

- పిసిసి అధ్యక్షులు వై.ఎస్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలపై న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికైనా వెనుకాడేది లేదని పిసిసి అధ్యక్షులు వై.ఎస్ షర్మిల పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అదానీ డీల్‌ను రద్దు చేసి, రూ.1750 కోట్ల ముడుపుల వ్యవహారంపై విచారణ నిర్వహించాలని 'ఎక్స్' వేదికగా ప్రభుత్వాన్ని సోమవారం డిమాండ్ చేశారు. మాజీ సిఎం జగన్ తప్పు చేస్తే... సెకీ ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేయలేదో చెప్పాలంటూ వైఎస్‌ఆర్‌సిపి నాయకుడు విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలకు సిఎం చంద్రబాబు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. 1,750 కోట్లు ముడుపులు తీసుకుని, రాష్ట్ర ప్రజల నెత్తిన రూ.1.50 లక్షల కోట్ల భారం వేశారన్నారు. అదానీ డీల్‌పై ప్రభుత్వం మౌనంగా ఉన్నా కాంగ్రెస్ పార్టీ మాత్రం ఉద్యమాన్ని ఆపేది లేదని చెప్పారు.

విక్రాంత్‌రెడ్డిపై కఠిన చర్యలొద్దు : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

కాకినాడ డీప్ వాటర్ పోర్టు వాటాల కొనుగోళ్ల వ్యవహారంపై సిఐడి పెట్టిన కేసులో వైసిపి రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి తనయుడు వై విక్రాంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఈ నెల 24న జరిగే తదుపరి విచారణ వరకు విక్రాంత్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోరాదని సిఐడిని హైకోర్టు ఆదేశించింది. సిఐడి పోలీసులు తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 24కు వాయిదా వేస్తూ జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో ప్రతివాదిగా ఫిర్యాదుదారు కెవి రావును చేసేందుకు అనుమతినిచ్చారు. తనను బెదిరించి కాకినాడ డీప్ వాటర్ పోర్టులో వాటాలను అరబిందో సంస్థ కొనుగోలు చేసిందని పేర్కొంటూ పోర్టు ప్రమోటర్ కెవి రావు ఫిర్యాదు ఆధారంగా సిఐడి.. విక్రాంత్‌రెడ్డిని తొలి నిందితుడిగా చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ విక్రాంత్‌రెడ్డి పిటిషన్ వేశారు.

సజ్జల భార్గవ్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

సోషల్ మీడియా పోస్టులపై పోలీసులు నమోదు చేసిన కేసులను కొట్టేయాలంటూ వైసిపి సోషల్ మీడియా మాజీ ఇన్‌ఛార్జి సజ్జల భార్గవ్‌రెడ్డికి సోమవారం హైకోర్టులో ఊరట లభించింది. భార్గవ్‌రెడ్డిపై రెండు వారాలపాటు ఎలాంటి కఠిన చర్యలూ తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు నోటీసులిచ్చింది. విచారణను ఈ నెల 26కు వాయిదా వేస్తూ జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి సోమవారం మధ్యంతర ఆదేశాలిచ్చారు. సోషల్ మీడియా పోస్టులపై పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ భార్గవ్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

గత సిఎం క్యాంప్ ఆఫీస్ ఫర్నీచర్‌పై పిటిషన్


వైసిపి అధినేత వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా, సిఎం క్యాంపు కార్యాలయ ఫర్నీచర్‌ను వెనక్కి తీసుకెళ్లాలన్న వినతిని సాధారణ పరిపాలనశాఖ (డిఎడి) పట్టించుకోవడం లేదంటూ వైసిపి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శులకు నోటీసులిచ్చింది. విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు.

పోక్సో కేసును కొట్టేయాలని చెవిరెడ్డి పిటిషన్

తిరుపతి జిల్లా, యర్రవారిపాలెం పోలీసులు తనపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడాన్ని వైసిపి నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. ఆ కేసులో తదుపరి చర్యలు నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ చక్రవర్తి విచారణ జరిపారు. ఫిర్యాదుదారు కుమార్తెను పరామర్శించేందుకు పిటిషనర్ ఆస్పత్రికి వెళ్లారని, ఆ తర్వాత మీడియాతో పిటిషనర్ మాట్లాడుతూ.. ఆమెపై అత్యాచారం జరిగినట్లుగా చెప్పారంటూ పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారని సీనియర్ న్యాయవాది పి వీరారెడ్డి చెప్పారు. ఫిర్యాదుదారు నుంచి తెల్లకాగితాలపై సంతకాలు తీసుకుని చెవిరెడ్డిపై తప్పుడు ఫిర్యాదు చేయించారని చెప్పారు. దీంతో ఫిర్యాదుదారుడు తనకు రక్షణ కల్పించాలని అదే హైకోర్టును ఆశ్రయించారని గుర్తు చేశారు. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ ప్రతివాదన చేస్తూ.. సమగ్ర వివరాలు తెలుసుకునేందుకు గడువు కావాలని కోరారు. దీంతో విచారణ ఈ నెల 24కు వాయిదా పడింది.

రాజ్యాంగ పరిరక్షణే తక్షణ కర్తవ్యం

- సిపిఎం కృష్ణా జిల్లా మహాసభలో ఉమామహేశ్వరరావు



సీతారాం ఏచూరి, మురాల రాజేష్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు ఎస్.పుణ్యవతి, వై.వెంకటేశ్వరరావు, వి.ఉమామహేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, వై.నరసింహారావు తదితరులు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

మోడీ పాలనలో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, స్వతంత్ర వ్యవస్థలు ధ్వంసమయ్యాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికతత్వాన్ని, రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడానికి ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో మోడీ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. సిపిఎం కృష్ణా జిల్లా 25వ మహాసభలో భాగంగా సోమవారం చల్లపల్లిలోని మురాల రాజేష్‌నగర్ (చండ్రరాజేశ్వరావు వికాస కేంద్రం)లో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. ఈ సభలో ఉమామహేశ్వరరావు ప్రారంభోపన్యాసం చేశారు. కేంద్రం జమిలి ఎన్నికల జపం చేస్తోందన్నారు. సిబిఐ, ఇడి తదితర వ్యవస్థలను పరిశీలించినప్పుడు అవి స్వతంత్రను కోల్పోయినట్లు స్పష్టం అవుతోందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, సమాఖ్యవాదాన్ని కాపాడుకోవడం తక్షణ కర్తవ్యంగా ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమాఖ్య వ్యవస్థపై జరుగుతున్న దాడుల పట్ల టిడిపి, జనసేన, వైసిపి తదితర ప్రాంతీయ పార్టీలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వానికి రాష్ట్రంలో 22 మంది ఎంపిలున్నా రాష్ట్ర విభజన హామీల అమలు, ప్రత్యేక హోదా, రాష్ట్రానికి అవసరమైన నిధులను సాధించుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. అమరావతి, పోలవరం నిర్మాణాలకు కేంద్రం నిధులు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను అడ్డుకుంటామని హామీ ఇచ్చిన టిడిపి కూటమి నేతలు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించిన విజన్-2047 రాష్ట్రంలోని రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగుల ప్రయోజనాలకు ఎటువంటి ప్రాధాన్యతా లేదని తెలిపారు. ప్రజల కొనుగోలు శక్తి పెంచే చర్యలు తీసుకోకుండా కార్పొరేట్లకు వనరులు కట్టబెట్టడం వల్ల రాష్ట్రాభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అదాని, సెకితో చేసుకున్న విద్యుత్ ఒప్పందం వల్ల రాష్ట్ర ప్రజలపై 25 ఏళ్లలో రూ.రెండు లక్షల కోట్ల భారం పడుతుందని తెలిపారు. గత విద్యుత్ ఉద్యమ అనుభవాలను సిఎం చంద్రబాబు పరిగణలోకి తీసుకుంటారో లేక అదానికి లొంగిపోతారో తేల్చుకోవాలని సూచించారు. ఈ భారాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతినిధుల సభ ప్రారంభ సూచికగా సిపిఎం పతాకాన్ని ఆ పార్టీ సీనియర్ నాయకులు భీమవరపు సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం వద్ద, సీతారాం ఏచూరి, మురాల రాజేష్ చిత్ర పటాల వద్ద సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.ఉమామహేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, ఎం.హరిబాబుతో పాటు సభకు హాజరైన ప్రతినిధులు పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్లం వెంకటేశ్వరరావు, కె.శివనాగేంద్రం, ధనశ్రీ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ పాల్గొన్నారు.

నేడు మంగళగిరి ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవం

- హాజరు కానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) తొలి స్నాతకోత్సవం మంగళవారం జరగనుంది. ఆ సంస్థ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు జరిగే ఈ ఉత్సవానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరు కానున్నారని ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మాధబ నందకర్ సోమవారం మీడియాకు తెలిపారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపర్చిన హామీల్లో భాగంగా ఎయిమ్స్ వైద్యశాలను మంగళగిరిలో ఏర్పాటు చేశారు. 2015 డిసెంబరు 19న శంకుస్థాపన జరిగింది. నిర్మాణాలు కొంత మేరకు పూర్తి కావడంతో 2019 మార్చి 12న అవుట్ పేషెంట్ రోగులకు చికిత్సలు ప్రారంభమయ్యాయి. 2019 నుంచి 2024 డిసెంబరు 10వ తేదీ వరకు 20,80,139 మంది రోగులకు అవుట్ పేషెంట్ విభాగంలో చికిత్సలు అందించారు. అయితే, ఇన్‌పేషెంట్ విభాగం నాలుగేళ్ల క్రితం ప్రారంభం కాగా, ఇప్పటి వరకు కేవలం 37,460 మంది చికిత్సలు పొందారు. నీటి సరఫరా సరిగా లేకపోవడం వల్ల ఇన్‌పేషెంట్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదనే విమర్శలు ఉన్నాయి.



పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

వైద్య కళాశాల ప్రస్థానం

ఎయిమ్స్ మంగళగిరి వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ మొదటి బ్యాచ్ ప్రవేశాలు 2018 అక్టోబరు 30న ప్రారంభమయ్యాయి. ఈ కళాశాలతోపాటు అదనపు తరగతుల కోసం విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాలలో కూడా బోధన కొనసాగింది. మొదటి బ్యాచ్ విద్యార్థులు తమ కోర్సును పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రస్తుతం తొలి స్నాతకోత్సవం నిర్వహిస్తున్నారు. 2022 నవంబరు నాలుగున మొదటి బిఎస్‌సి నర్సింగ్ బ్యాచ్‌లకు కోర్సు, 2022 జులైలో మొదటి బ్యాచ్ ఎండి, ఎంఎస్ పోస్టు గ్రాడ్యుయేట్ బ్యాచ్‌లకు విద్యార్థులు ఇండక్షన్ ప్రారంభమైంది.

స్నాతకోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

స్నాతకోత్సవ ఏర్పాట్లు జిల్లా అధికారులు, ఎయిమ్స్ డైరెక్టర్ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. కలెక్టర్ ఎస్,.నాగలక్ష్మి, ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కళాశాల విద్యార్థులు, వైద్యులతోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులకు పరిమిత సంఖ్యలోనే అనుమతిస్తున్నారు. ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి పర్యవేక్షణలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎపి, తెలంగాణలో రాష్ట్రపతి ఐదు రోజుల పర్యటన

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం నుంచి ఐదు రోజులపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పర్యటించనున్నారని రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో వెల్లడించింది. మంగళవారం ఎయిమ్స్ స్నాతకోత్సవం అనంతరం హైదరాబాద్‌కు చేరుకుని, బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారు. 18న రాష్ట్రపతి నిలయంలో పలు కార్యక్రమాల ప్రారంభం, శంకుస్థాపన చేస్తారు. ఈ నెల 20న సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌కు రాష్ట్రపతి ముర్ము అవార్డును అందజేయనున్నారు. అదేరోజు సాయంత్రం రాష్ట్రపతి నిలయంలో రాష్ట్ర ప్రముఖులు, ప్రముఖ పౌరులు, విద్యావేత్తలు తదితరులకు ఎట్ హోమ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు.

రైల్వే, నేషనల్ హైవే పనులు 2026 డిసెంబర్ నాటికి పూర్తి

- మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులు 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని నేషనల్ హైవే, రైల్వే అధికారులను రోడ్లు, భవనాలశాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి ఆదేశించారు. ఇందుకనుగుణంగా జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ, అటవీ క్లియరెన్స్, మైనింగ్ సమస్యలను నిర్దిష్టమైన కాలపరిమితిలో పూర్తి చేయాలని సూచించారు. సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో సోమవారం జాతీయ రహదారులు, రైల్వే, అటవీ, రెవెన్యూ, గనులశాఖ ఉన్నతాధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల ప్రాజెక్టులు (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ ఎ)), కేంద్ర రహదారులు, రవాణా, హైవే మంత్రిత్వశాఖ (ఎంఆర్‌టిహెచ్) ఆధ్వర్యంలో రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించి పనులు వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో టాస్క్‌ఫోర్స్ కమిటీతో చర్చించారు. నిర్ణీత కాలవ్యవధిని పెట్టుకుని ఆయా ప్రాజెక్టుల పనులు సకాలంలో ప్రారంభించి పూర్తి చేసే విధంగా ప్రణాళికలు రచించుకోవాలని అధికారులకు సూచించారు. నేషనల్ హైవే, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ, అటవీ క్లియరెన్స్, నిధులు విడుదల, అలైన్‌మెంట్ మార్పులు, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు, ఆయా శాఖల మధ్య సమన్వయం వంటి సమస్యల పరిష్కారానికి మంత్రి ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ కమిటీ కీలక సూచనలు చేసింది. రాష్ట్రంలో గతిశక్తి ప్రాజెక్టు కింద ఉన్న ఆర్‌ఒబి, ఆర్‌యుబి లెవెల్ క్రాసింగ్ మూసివేతకు సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్‌అండ్‌బి ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా, గనులశాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, వి.రామచంద్ర, ఇఎన్‌సి (ఆర్‌అండ్‌బి) శేషకుమార్, సిఇ (ఆర్‌అండ్‌బి) తదితరులు పాల్గొన్నారు.

ట్రూ అప్ ఛార్జీల భారాలపై నిరసన

- పలుచోట్ల విద్యుత్ బిల్లులు దహనం



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం శ్యామలా సెంటర్‌లో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

పెంచిన విద్యుత్ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలను, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. పలుచోట్ల విద్యుత్ బిల్లులను దహనం చేశారు. సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, కరెంట్ బిల్లులు తగ్గించాలని నినదించారు.

తిరుపతి జిల్లా గూడూరు టవర్‌క్లాక్ వద్ద సిపిఎం, సిఐటియు ప్రజాసంఘాల నాయకులు నిరసన తెలిపారు. కరెంట్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికలకు ముందు చెప్పిన టిడిపి కూటమి నేతలు, అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ట్రూ అప్ ఛార్జీల పేరిట భారాలు మోపడం సరికాదన్నారు. స్మార్ట్ మీటర్లను బిగించరాదని డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు, పెనుకొండ మండల కేంద్రాల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. పెంచిన ట్రూ అప్, ఇతర సర్దుబాటు ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలోని జివిఎంసి 94వ వార్డు పరిధి అప్పలనరసయ్య కాలనీలో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని శ్యామలా సెంటర్‌లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ.. వైసిపి హయాంలో సర్దుబాటు భారాలు వేస్తే నాడు ప్రతిపక్షంగా ఉన్న చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తీవ్రంగా విమర్శించారన్నారు. తాము అధికారంలోకి వస్తే ఛార్జీలు పెంచబోమంటూ హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో సర్దుబాటు పేరుతో ప్రజలపై భారాలు మోపడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. కడప ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ సర్కిల్‌లో విద్యుత్ బిల్లుల దహనం చేసి నిరసన తెలిపారు.

మామిడి బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- 31 వరకు ప్రీమియం గడువు పెంపునకు అధికారుల హామీ
- ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మామిడి పంటకు సంబంధించిన బీమా చెల్లించడానికి ఈ నెల 31 వరకు గడువు పొడిగించేందుకు వ్యవసాయశాఖ కమిషనరు కార్యాలయం బీమా విభాగం అధికారులు అంగీకరించినట్లు ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మామిడి బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. రాష్ట్రంలో మామిడి తోటలకు బీమా చెల్లించడానికి వాస్తవంగా నవంబరు 24తో గడువు ముగిసిందన్నారు. దీంతో అనేక ప్రాంతాల్లో రైతులు బీమా చెల్లించలేకపోయారని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎపి కౌలు రైతు సంఘం ప్రతినిధి బృందం సంబంధిత అధికారులను కలిసిన నేపథ్యంలో గడువు పొడిగింపుపై హామీ లభించిందన్నారు. మామిడి తోట సాగుదారులు, కౌలు దారుల పేరుతోనే ఇ-క్రాప్ చేయాలని, రైతులు ప్రీమియం ఒక రూపాయి చెల్లించిన మిగిలిన మొత్తం డబ్బును ప్రభుత్వమే చెల్లించేట్లు చర్యలు తీసుకోవాలని ఎపి కౌలు రైతు సంఘం నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పంటల బీమా చెల్లించిన ప్రతి రైతుకూ రసీదు ఇవ్వాలని, ఈ విషయంపై గ్రామాల్లో రైతాంగానికి అవగాహన కలిగేలా విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

రేడియేటర్‌లో నీళ్ల కోసం వెళ్లిన విద్యార్థి

నీటి కుంటలో పడి మృతి

- అతన్ని కాపాడేందుకు వెళ్లిన క్లీనర్...

ప్రజాశక్తి - దాచేపల్లి (పల్నాడు జిల్లా)



మృతుడు సుభాష్

బస్సు రేడియేటర్‌లో నీళ్ల కోసం వెళ్లిన ఓ విద్యార్థి నీటి కుంటలో పడి చనిపోయారు. అతన్ని కాపాడేందుకు వెళ్లిన క్లీనర్ కూడా మరణించారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. గతంలో పాఠశాల నుంచి విద్యార్థులను తీసుకువస్తుండగా మార్గమధ్యలో బస్సును నిలిపి మద్యం సేవించేందుకు డ్రైవర్ వెళ్లారని, పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేస్తే వారు మందలించి వదిలేశారని, బస్సును సరిగా చూసుకోకపోవడం తోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా దాచేపల్లిలోని శ్రీ చైతన్య పాఠశాల బస్సు డ్రైవర్‌గా దాచేపల్లికి చెందిన పప్పుల కోటేశ్వరరావు, అతని పెదనాన్న కుమారుడైన పెదకోటేశ్వరరావు (50) క్లీనర్‌గా పనిచేస్తున్నారు. గురజాల మండలం పులిపాడులో విద్యార్థులను ఎక్కించుకుని కొద్ది దూరం రాగానే బస్సు నుంచి పొగలు వచ్చాయి. రేడియేటర్‌లో నీళ్ళు అయిపోయినట్లు గుర్తించిన డ్రైవర్... నీళ్లు తీసుకురావాలని క్లీనర్‌కు చెప్పారు. రెండు డబ్బాలతో నీళ్లు తీసుకువచ్చేందుకు క్లీనర్ తనతో పాటు ఐదో తరగతి విద్యార్థి కె.సుభాష్ (11)ను దగ్గరలోని నర్సరీకి చెందిన నీటి కుంట వద్దకు తీసుకువెళ్లారు. నీటి కోసం దిగిన సుభాష్ కుంటలో జారిపడగా అతన్ని కాపాడేందుకు క్లీనర్ నీటిలోకి దిగాడు. కుంట లోతు ఎక్కువగా ఉండడంతో ఊపిరాడక ఇద్దరూ మృతి చెందారు. స్థానికులు గమనించి కుంటలోని నీటిని తొలగించి మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘటనలో డ్రైవర్ పరారయ్యాడు. ఘటనాస్థలిని డిఎస్‌పి, ఆర్‌డిఒ పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు పోలీసులు తరలించారు. కేసు నమోదు చేశారు.

కార్మికోద్యమ నేత నండూరి ప్రసాదరావు సతీమణి

సుమిత్ర కన్నుమూత

ప్రజాశక్తి- హైదరాబాద్, అమరావతి బ్యూరోలు



సిఐటియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక నాయకులు, కార్మికోద్యమ నిర్మాత నండూరి ప్రసాదరావు సతీమణి, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు సుమిత్ర (92) సోమవారం ఉదయం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో కన్నుమూశారు. ఆరు నెలలుగా అనారోగ్యంతో ఆమె బాధపడుతున్నారు. కోవిడ్ సమయంలో కరోనా సోకినప్పటి నుంచి అస్వస్థతగానే ఉంటున్నారు. ఆమె మృతి పట్ల ఎపి, తెలంగాణ సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మరణం బాధాకరమని పేర్కొన్నారు. అశ్రునయనాల మధ్య వనస్థలిపురం శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సుమిత్ర పాల్గొన్నారు. ఈ పోరాటం విరమణ తర్వాత ఆమె చదువుకుని హైదరాబాద్‌లోని నారాయణగూడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేశారు. ఆ తర్వాత ప్రధానోపాధ్యాయునిగా కూడా ఆమె సేవలందించారు. ప్రసాదరావు ఉద్యమ జీవితంలో దాదాపు నాలుగు దశాబ్దాలు చేదోడు, వాదోడుగా సుమిత్ర ఉన్నారు. ప్రసాదరావు మరణించక కూడా ఓపిక ఉన్నంతవరకూ సిఐటియు సభలు, సమావేశాల్లో ఆమె పాల్గొనేవారు. సుమిత్ర భౌతికకాయాన్ని తెలంగాణ సిఐటియు సీనియర్ నాయకులు పి.రాజారావు, ఉపాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ నాయక్ తదితరులు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. సుమిత్ర మృతి పట్ల సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. సిఐటియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ తీవ్ర సంతాపం తెలియజేశారు.

ఎపి రాష్ట్ర కార్యాలయంలో సంతాప సభ

సుమిత్ర సంతాప సభ సిఐటియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగింది. ఆమె చిత్రపటానికి ఆలిండియా ట్రాన్స్‌పోర్ట్ నాయకులు ఆర్.లక్ష్మయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు,ఉపాధ్యక్షులు పి.అజయకుమార్, కార్యదర్శులు కె.ధనలక్ష్మి, కె.సుబ్బరావమ్మ, కె.ఉమామహేశ్వరరావు, ముజఫర్ అహమ్మద్, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు జిలాని, అయ్యప్పరెడ్డి, సుందరయ్య, రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ నాయకులు శివాజీ, దుర్గారావు, విఎఎ సంఘం అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ (ఆయా) వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కోరింది. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల పారిశుధ్యం డైరెక్టర్ బి శ్రీనివాసరావును యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సరోజ, దయా రమాదేవి సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. శానిటేషన్ కార్మికులుగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి జులై నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా ఎస్ రాయవరం మండలం కురుప్రోలు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఏడిద కుమారి మృతిచెందారని తెలిపారు. ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, నష్టపరిహారం రూ.25 లక్షలు ఇవ్వాలని కోరారు. 300 మంది విద్యార్థులకు ఒక ఆయా కాకుండా, 50 మందికి నియమించాలని తెలిపారు. పెండింగ్ వేతనాలు చెల్లించి, ప్రతినెలా 5వ తేదీలోపు చెల్లించాలని కోరారు. ప్రమాద బీమా, ఇఎస్‌ఐ సౌకర్యం కల్పిలంచాలని, ప్రతియేటా రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, రాజకీయ కక్ష సాధింపులతో వర్కర్ల తొలగింపులు ఆపాలని, స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరారు.

100 పడకలతో పిఠాపురం సిహెచ్‌సి

- జిఓ ఎంఎస్ నెంబరు 156 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పిఠాపురంలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఉన్న ప్రభుత్వాస్పత్రిని 100 పడకల సామర్థ్యం కలిగిన ఆస్పత్రిగా ప్రభుత్వం మార్చింది. ఈ మేరకు సోమవారం జిఓ ఎంఎస్ నెంబరు 156ను విడుదల చేసింది. పిఠాపురం ప్రజలకు ఎన్నికల సమయంలో పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీ మేరకు ఆస్పత్రి స్థాయిని 100 పడకల ఆస్పత్రిగా మారుస్తామని ఇచ్చిన హామీ నెరవేరింది. దీంతో సామర్థ్యం పెంపుతో ఆస్పత్రిలో సౌకర్యాల కల్పన, వసతుల పెంపు కోసం ప్రభుత్వం రూ.38.22 కోట్లు విడుదల చేయనుంది. పెంచిన పడకలకు అవసరమైన ప్రత్యేక భవనాలు, ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, కావాల్సిన ప్రత్యేకమైన సౌకర్యాల కల్పనకు ఈ నిధులు వినియోగించనున్నారు. ఆస్పత్రి సామర్థ్యానికి తగినట్లు 66 మంది అదనపు వైద్య సిబ్బందిని ప్రభుత్వం నియమించనుంది. పిఠాపురం ఆస్పత్రికి జనరల్ సర్జన్, చెవి, ముక్కు, గొంతు నిపుణులు, కంటి, ఆర్థోపెడిక్స్, పెథాలజి, డెంటల్, రేడియాలజీ వంటి కీలక విభాగాలు రానున్నాయి.



మృతదేహాన్ని రహదారిపై పెట్టి ధర్నా చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు ((ఇన్‌సెట్‌లో) మృతుడు రంజిత్ (ఫైల్))

కాల్వలో పడి ఫార్మసీ విద్యార్థి మృతి

- మృతదేహంతో రహదారిపై ధర్నా

ప్రజాశక్తి - మేడికొండూరు

ఫార్మసీ కళాశాల విద్యార్థి చెరువులో పడి మృతి చెందారు. విద్యార్థి మృతదేహంతో తల్లిదండ్రులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు రహదారిపై సోమవారం ధర్నా చేపట్టారు. ఈ ఘటన గుంటూరు జిల్లా మేడికొండూరు మండలంలోని జంగంగుంట్లపాలెంలో జరిగింది. విద్యార్థులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం మూల్పూరుకు చెందిన వ్యవసాయ కార్మికులైన మూల్పూరి రత్నం, ఝాన్సీరాణి దంపతుల కుమారుడు రంజిత్ (22) కెసిరెడ్డి ఫార్మసీ కళాశాలలో బి ఫార్మసీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీకి నీటిని పక్కనే ఉన్న చెరువు నుండి మోటార్ల ద్వారా సరఫరా చేస్తుంటారు. అవి మరమ్మతుకు గురవడంతో ప్రత్యామ్నాయ మోటార్లు మార్చేందుకు కళాశాల సిబ్బంది క్రికెట్ ఆడుతున్న రంజిత్‌తో పాటు మరో ముగ్గురు విద్యార్థులను చెరువు దగ్గరకు తీసుకెళ్లారు. మోటార్లను మరమ్మతు చేస్తుండగా రంజిత్ కాలుజారి చెరువులో పడి మునిగిపోయాడు. బురద కావడంతో అందులో కూరుకుపోయి పైకి రాలేకపోయాడు. రంజిత్‌ను కాపాడేందుకు తోటి విద్యార్థులు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి రంజిత్ మృతదేహాన్ని సోమవారం ఉదయం బయటకు తీశాయి. కళాశాల యాజమాన్యం నిర్వహణ లోపం కారణంగానే ఈ ఘటన జరిగిందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో రంజిత్ మృతదేహంతో గుంటూరు-మాచర్ల ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. రెండు గంటలపాటు ధర్నాతో వాహనాలు భారీగా నిలిచాయి. కళాశాల యాజమాన్యం దిగివచ్చి మృతుని కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు మేడికొండూరు సిఐ షేక్ నాగూర్ మీరాసాహెబ్, ఎస్‌ఐ షేక్ ఖాజీబాబా తెలిపారు.

హత్యా రాజకీయాలకు తావులేదు

- టిడిపి నేత హత్యకు కుట్రపై మంత్రి అచ్చెన్నాయుడు సీరియస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లా పలాసలో టిడిపి నాయకుడి హత్యకు కుట్ర పన్నిన అంశంపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కెవి మహేశ్వర రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాలో ఇటువంటి సంస్కృతి ఎన్నడూ లేదని, ప్రశాంతంగా ఉన్న జిల్లాలో ఇటువంటి హత్యా రాజకీయాలకు తావు లేదన్నారు. ఈ ఘటనలో ఎవరు ఉన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు హత్యా రాజకీయాలను ప్రోత్సహించిందని, అధికారం కోల్పోయిన తర్వాతా అదే పద్ధతి కొనసాగిస్తోందని విమర్శించారు. ఇటువంటి చర్యలను ఉపేక్షించేది లేదన్నారు.

ఏం జరిగిందంటే..?

పలాస పట్టణ టిడిపి అధ్యక్షులు బడ్డ నాగరాజును హత్య చేసేందుకు కొందరు వ్యక్తులు బీహార్ గ్యాంగ్‌కు రూ.పది లక్షలు సుపారీ ఇచ్చినట్లు చర్చ సాగుతోంది. మారణాయుధాలతో జిల్లాకు చేరుకున్న ఈ గ్యాంగ్‌ను టెక్కలిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాగరాజు హత్యకు సుపారీ తీసుకున్నామని వారు విచారణలో పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పలాస పట్టణానికి చెందిన కొందరు వైసిపి నాయకులను ఆదివారం అర్ధరాత్రి తర్వాత పోలీసులు విచారణకు తీసుకువెళ్లారు.

ఏనుగుల బెడదతో రోడ్డెక్కిన రైతులు

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు (తిరుపతి)

తిరుపతి జిల్లా భాకరాపేట, ఎగవూరు, దిగవూరు పరిసర ప్రాంతాల్లో పంట పొలాలను ఏనుగులు ధ్వంసం చేస్తుండడంతో అన్నదాతలు రోడ్డెక్కారు. భాకరాపేట రహదారిపై ఆందోళనకు దిగారు. ఏనుగుల బారి నుంచి తమ పంట పొలాలను కాపాడాలని నినాదాలు చేశారు. బాధిత రైతులు మాట్లాడుతూ.. చెరకు, వరి, టమాట, అరటి తదితర పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. పంటలకు నష్టం కల్గించడంతో పాటు ముళ్ల కంచెలు, పైపులు, మోటార్లను ధ్వంసం చేసి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని తెలిపారు. దీని వల్ల లక్షలాది రూపాయలు నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫారెస్టు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్యను పరిష్కరించకపోవడంతో రోడ్డెక్కామని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అనంతరం భాకరాపేట ఫారెస్టు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

అదాని, అంబానిల నుండి అడవిని కాపాడుకోవాలి

- రంపచోడవరం ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలి
- పోలవరం నిర్వాసితుల ఉద్యమం ఉధృతం
- జిఓ 3 పునరుద్ధరణ, అటవీ హక్కుల రక్షణకు పోరాటాలు
- సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రథమ మహాసభలో వి శ్రీనివాసరావు



రంపచోడవరంలో సాగుతున్న భారీ ర్యాలీ,బహిరంగ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, కిల్లో సురేంద్ర తదితరులు ఇన్‌సెట్‌లో

ప్రజాశక్తి- రాజవొమ్మంగి, రంపచోడవరం విలేకరులు

రంపచోడవరం కేంద్రంగా ప్రభుత్వం ప్రత్యేక జిల్లాను ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అదాని, అంబానిల బారి నుంచి అడవులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీలో గిరిజనుల హక్కులు, చట్టాలు పటిష్ట అమలుకు అల్లూరి స్ఫూర్తితో పోరాడాలని, లేనిపక్షంలో ఏజెన్సీ వాసులను పాలకులు పట్టించుకునే పరిస్థితి లేదని తెలిపారు. కార్పొరేట్ల లబ్ధి కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు. రెండు రోజులపాటు జరగనున్న సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రథమ మహాసభ రంపచోడవరం వేదికగా సోమవారం ప్రారంభమైంది. పార్టీ జిల్లా కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా భారీ సంఖ్యలో హాజరైన పార్టీ కార్యకర్తలు, ఆదివాసీలతో ఈ ర్యాలీ ఉత్తేజంగా సాగింది. కళారూపాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం రంప రోడ్డులో పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదివాసీ పోరాటాల పురిటిగడ్డ రంపచోడవరంలో జరుగుతున్న ఈ మహాసభకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సరే... మునిగిపోతున్న లక్ష కుటుంబాల మాటేంటని ప్రశ్నించారు. పునరావాసం కల్పించాకే ప్రాజెక్టు నిర్మాణం జరగాలని చట్టాలు చెబుతున్నాయన్నారు ఇప్పటి వరకూ పది శాతమే పునరావాసం జరిగిందని, మిగిలిన 90 శాతం పరిస్థితి ఏమిటో పాలకులు చెప్పడం లేదన్నారు. పునరావాసం, పరిహారం కల్పించాలని, 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీ ఇవ్వాలని, పోడు భూములకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయాల్లో ఆదివాసీలకు అన్యాయం చేస్తుండడం తగదన్నారు. గడిచిన మూడేళ్లలో నిర్వాసితుల సమస్యలపై చేసిన పోరాటాలను గుర్తు చేశారు. జిఓ నెంబర్ 3 పునరుద్ధరణకు, 1/70 చట్టం, పీసా చట్టం అమలుకు ఉద్యమించామన్నారు. ఏజెన్సీలో పటిష్టమైన విద్య, వైద్యం, మౌలిక సదుపాయల కల్పన, పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా సిపిఎం పనిచేస్తోందని వివరించారు. రాజ్యాంగంలోని అంశాలను, ఐదో షెడ్యూల్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయన్నారు. గతంలో వామపక్ష పార్టీల ఒత్తిడితో తీసుకొచ్చిన చట్టాలను నేటి పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునే బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. సనాతన ధర్మం కోసం కొందరు మాట్లాడుతున్నారని, ఏజెన్సీ గురించి అటువంటివారు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కులమతాలను రెచ్చగొడుతున్నారన్నారు. అదాని అవినీతిపై పార్లమెంట్‌లో ప్రతిపక్షం నిలదీస్తున్నా, కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదని తెలిపారు. దేశంలో మైనార్టీలపై రోజురోజుకూ దాడులు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి, ఆర్‌ఎస్ఎస్‌లను ఏజెన్సీలో అడుగు పెట్టకుండా చూడాలన్నారు. లేనిపక్షంలో ఏజెన్సీ మరో మణిపూర్ అవుతుందన్నారు. ఏజెన్సీలోని స్కీం వర్కర్లను, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్లను, ఉద్యోగ, ఉపాధ్యాయులను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం దారుణమన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, కిల్లో సురేంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు సహజ వనరులను దోచిపెడుతోందన్నారు. దేశంలో మహిళలకు భద్రత కరువైందని తెలిపారు. వేదికపై పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, ఎం.వాణిశ్రీ, ఎం.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు. అనంతరం ఆర్‌పి ఫంక్షన్ హాలులో పూనెం సత్యనారాయణ నగర్, సీతారాం ఏచూరి ప్రాంగణంలో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. లోతా రామారావు, సీసం సురేష్, కాకా అర్జున్, కారం లక్ష్మి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

ఎస్‌సి వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ పర్యటన



వినతులు స్వీకరిస్తున్న కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ సోమవారం జిల్లాలో పర్యటించింది. విశ్రాంత ఐఎఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్... కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయా షెడ్యూల్ కులాల ప్రతినిధులు, ప్రజలు, ఉద్యోగ సంఘాలు, కుల సంఘాల నాయకుల నుంచి వినతిపత్రాలను స్వీకరించింది. ఈ సందర్భంగా పలు సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ పంజాబ్, తమిళనాడులో ఎస్‌సి వర్గీకరణ అమలుతో పాటు హర్యానా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎస్‌సి జనాభా గణనకు 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలని కొందరు కోరగా, పూర్తిగా కొత్తగా కుల గణన నిర్వహించిన తర్వాతే తగు నిర్ణయం తీసుకోవాలని మరికొందరు విన్నవించారు. విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక రంగాల్లో ఆయా ఉప కులాల ప్రాతినిధ్యంపై చర్చించారు. సుమారు 59 షెడ్యూల్డ్ ఉప కులాల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. మినిట్స్ నమోదు చేశారు. అందరి అభిప్రాయాలను క్రోడీకరించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తామని కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. ఎవరైనా తమ విజ్ఞప్తులను నేరుగా సమర్పించలేకపోయినా, గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయం, విజయవాడలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ కార్యాలయంలో మెమోరాండం ఇవ్వవచ్చని చెప్పారు. ఇంకా ఎక్‌నాలెడ్జ్‌మెంట్‌తో కూడిన తమ విజ్ఞప్తులను పోస్టులో గానీ, omcscsubclassification@gmail.com ఈ-మెయిల్ ద్వారా గానీ 2025 జనవరి తొమ్మిదో తేదీ వరకు సమర్పించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డిడి విశ్వమోహన్ రెడ్డి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లలో రూ.12 లక్షల కోట్ల రుణాలు మాఫీ



- సగం పిఎస్‌యుల్లోనే రద్దు

న్యూఢిల్లీ : రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు, చాలీచాలని జీతాలతో బతుకు బండిని లాగుతున్న మధ్యతరగతి జీవులు చెల్లించాల్సిన రుణ బకాయిలను బ్యాంకులు ముక్కు పిండి మరీ వసూలు చేస్తాయి. నోటీసులు జారీ చేస్తూ వారిని భయపెడుతుంటాయి. అప్పు తీర్చడం ఆలస్యమైతే తట్టా బుట్టా బయట పడేసి ఇంటి నుండి గెంటేస్తాయి. ఆస్తులు జప్తు చేసి నిలువ నీడ లేకుండా చేస్తాయి. అదే బడా బాబులైతే...చూసీ చూడనట్లు వ్యవహరిస్తాయి. వందల కోట్ల అప్పులు ఎగవేసి దేశం వదిలి పారిపోతున్నా ఏమీ ఎరగనట్లే మిన్నకుండి పోతాయి. చివరికి వాటిని రానిబాకీల పద్దులో వేసి, రుణాలు మాఫీ చేసి చేతులు దులుపుకుంటాయి. 2014-15, 2023-24 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో...అంటే గత పది సంవత్సరాలలో దేశంలోని వాణిజ్య బ్యాంకులు మాఫీ చేసిన రుణాల విలువ అక్షరాలా రూ.12.3 లక్షల కోట్లు. వీటిలో 53 శాతం (రూ.6.5 లక్షల కోట్లు) రుణాలను గత ఐదు సంవత్సరాల కాలంలోనే (2019-20, 2023-24 మధ్య) ప్రభుత్వ రంగ బ్యాంకులు మాఫీ చేశాయి. పార్లమెంటులో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ప్రభుత్వం ఈ వివరాలు అందజేసింది.

2018-19 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ రంగం మాఫీ చేసిన రుణాలు గరిష్ట స్థాయి అంటే రూ.2.4 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2015లో ఆస్తుల నాణ్యతా సమీక్ష ప్రారంభమైన తర్వాత ఈ స్థాయిలో రుణాలు రద్దు కావడం ఆ సంవత్సరమే జరిగింది. 2023-24లో అత్యల్పంగా రూ.1.7 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు మాఫీ చేశాయి. ఆ సమయంలో బ్యాంకులకు రావాల్సిన రుణ బకాయిల మొత్తం రూ.165 లక్షల కోట్లు. అందులో కేవలం ఒక శాతం మాత్రమే రద్దయింది. బ్యాంకింగ్ రంగ ఇంక్రిమెంటల్ రుణంలో ప్రభుత్వ బ్యాంకులు ప్రస్తుతం 51 శాతం వాటాను కలిగి ఉన్నాయి. 2022-23లో ఈ వాటా 54 శాతంగా ఉంది.

2020-2024 మధ్యకాలంలో అత్యధిక రుణాలు మాఫీ చేసిన బ్యాంకుల్లో ఎస్‌బిఐ మొదటి స్థానంలో ఉంది. ఆ దిగ్గజ బ్యాంక్ రూ.1,46,652 కోట్ల రుణాలను రద్దు చేయగా.. చేస్తే పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.82,449 కోట్లు, యూనియన్ బ్యాంక్ రూ.82,323 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.77,177 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.45,467 కోట్ల రుణాల మాఫీతో తర్వాతి స్థానాలలో నిలిచాయి. ఈ సంవత్సరం సెప్టెంబర్ 30వ తేదీ నాటికి ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల స్థూల పారు బకాయిలు వరుసగా రూ.3,16,331 కోట్లు, రూ.1,34,339 కోట్లుగా ఉన్నట్లు రిజర్వ్‌బ్యాంక్ తెలిపిందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి చెప్పారు. ఇది మొత్తం పారు బకాయిలలో వరసగా 3.01 శాతం, 1.86 శాతంగా ఉన్నదని వివరించారు.

దేశంలోని బ్యాంకింగ్ కార్యకలాపాలలో ఎస్‌బిఐ ఐదో వంతు స్థానాన్ని ఆక్రమించింది. ఈ బ్యాంక్ గత పది సంవత్సరాల కాలంలో రెండు లక్షల కోట్ల రూపాయల రుణాలను రద్దు చేసింది. జాతీయ బ్యాంకుల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.94,702 కోట్ల రుణాలు మాఫీ చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ వరకూ ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.42,000 కోట్ల రుణాలు రద్దు చేశాయి. గత ఐదు సంవత్సరాల కాలంలో ఇది రూ.6.5 లక్షల కోట్లుగా నమోదైంది. రుణాలు రద్దు చేసినంత మాత్రాన బకాయిదారులు బాధ్యతల నుండి తప్పించుకోలేరని, ఈ నిర్ణయం వారికేమీ ప్రయోజనం కలిగించబోదని, ఆయా ఖాతాదారులపై ఇప్పటికే ప్రారంభించిన చర్యలు కొనసాగుతాయని మంత్రి చౌదరి తెలిపారు. బకాయిల వసూలు కోసం సివిల్ కోర్టులు లేదా రుణ రికవరీ ట్రిబ్యునల్స్‌లో దావా వేస్తామని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో కేసులు పెడతామని, ఆస్తులను విక్రయిస్తామని తెలిపారు.

తగ్గిన మొండి బాకీలు..

దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు 2023-24లో అత్యధికంగా సగటున రూ.1.41 లక్షల కోట్ల నికర లాభాలు ఆర్జించాయని ప్రభుత్వం విడిగా ఓ ప్రకటన చేస్తూ తెలిపింది. ఆస్తుల నాణ్యత మెరుగుపడిందని, సెప్టెంబరులో స్థూల రానిబాకీల 3.12 శాతానికి పడిపోయిందని వివరించింది. 2024-25 తొలి అర్థ భాగంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.85,520 కోట్ల నికర లాభాన్ని ఆర్జించాయి.

రికార్డ్ స్థాయికి వాణిజ్య లోటు

- పెరిగిన దిగుమతులు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఏడాది నవంబర్‌లో భారత ఎగుమతులు తగ్గడం, దిగుమతులు భారీగా పెరగడంతో వాణిజ్య లోటు రికార్డ్ స్థాయికి ఎగిసింది. క్రితం నెలలో వాణిజ్య లోటు ఏకంగా 37.84 బిలియన్ డాలర్లకు చేరిందని సోమవారం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ గణంకాలు వెల్లడించింది. ఇంతక్రితం అక్టోబర్‌లో ఇది 27.1 బిలియన్లుగా నమోదయ్యింది. గతేడాది నవంబర్‌లో 33.75 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు ఈ ఏడాది 32.11 బిలియన్ డాలర్లకు క్షీణించాయి. గతేడాది నవంబర్‌తో పోలిస్తే ఈసారి దిగుమతులు 27శాతం పెరిగి 69.95 బిలియన్ డాలర్లకు ఎగిశాయి.

2023 నవంబర్‌లో 55.06 బిలియన్ల దిగుమతులు జరిగాయి. గడిచిన నెలలో బంగారం దిగుమతులు రికార్డ్ స్థాయిలో 14.8 బిలియన్లుగా నమోదయ్యాయి.



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న మహిళా కార్మికులు

వేతనాలు పెంచాలని మహిళా కార్మికుల ధర్నా

- రోడ్డుపై బైఠాయింపు

ప్రజాశక్తి - గోరంట్ల (శ్రీ సత్యసాయి జిల్లా)

వేతనాల పెంపు, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహిళా కార్మికులు ఆందోళనబాట పట్టారు. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గుంతలపల్లి గ్రామం వద్ద ఎక్స్‌పోర్టు ఓవర్సీస్ గార్మెంట్స్ పరిశ్రమ ఉంది. ఇందులో మహిళలు పలు విభాగాల్లో పనిచేస్తున్నారు. పనికి తగ్గ వేతనాలను ఇవ్వడంలో యాజమాన్య నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సోమవారం ఉదయం పుట్టపర్తి-గోరంట్ల రహదారిపై కార్మికులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులు మాట్లాడుతూ.. అధిక పని చేయించుకుంటూ తక్కువ వేతనాలు ఇస్తున్నారని వాపోయారు. కదిరి, ధర్మవరం, కొత్తచెరువు, ఒడిసి మండలాల నుంచి వచ్చే కార్మికులు తమ వేతనంలో బస్సు ఛార్జీలకే అధిక భాగం చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. అత్యవసరం సమయంలో బయటకు వెళ్లాలంటే సెలవులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్సు ఛార్జీలను యాజమాన్యమే చెల్లించాలని, పరిశ్రమలో క్యాంటిన్ ఏర్పాటు చేయాలని కోరారు. పై సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. సమస్యల పరిష్కారంపై యాజమాన్యం స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదని రోడ్డుపైనే బైఠాయించారు. మహిళా కార్మికుల డిమాండ్లపై ఫ్యాక్టరీ యాజమాన్యంతో వెంటనే మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిఎం దినేష్ హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు.

బిల్లుల కోసం కాంట్రాక్టర్ ఆగ్రహం

- పిజిఆర్ఎస్‌లో కలెక్టర్ ఎదుట దుర్భాషలు
- అధికారులను దూషించలేదంటూ వీడియో


కాంట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న పోలీసులు (కళ్లజోడు ఉన్న వ్యక్తి కాంట్రాక్టర్)

ప్రజాశక్తి - పిఠాపురం(కాకినాడ జిల్లా)

తాను చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదంటూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఓ కాంట్రాక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. కలెక్టర్‌తో వాగ్వాదానికి దిగాడు. అంతేకాకుండా దుర్భాషలాడుతూ అసహనాన్ని వ్యక్తం చేశాడు. ఈ ఘటన కాకినాడ జిల్లా పిఠాపురంలో సోమవారం చోటు చేసుకుంది.

పిఠాపురంలోని రథాలపేట అంబేద్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్లో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను నిర్వహించారు. పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ సురవరపు సత్తిరాజు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

తాను ఈ ఏడాది అన్న క్యాంటీన్ రీ మోడలింగ్, కాలువలో సిల్టు తొలగింపు పనులను నిర్వహించానన్నారు. ఆ పనులకు సంబంధించిన బిల్లులు నేటికీ చెల్లించలేదని, వెంటనే ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు. బిల్లులు వస్తాయని కలెక్టర్ చెప్పే ప్రయత్నం చేశారు. ఒకానొక దశలో కాంట్రాక్టర్ తీవ్ర అసహనానికి గురై దుర్భాషలాడారు. వెంటనే పిఠాపురం సిఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ వి.మణికుమార్, సిబ్బంది జోక్యం చేసుకుని కాంట్రాక్టర్‌ను బయటకు పంపించే ప్రయత్నం చేశారు.

అధికారులను దూషించలేదు : కాంట్రాక్టర్

ఈ ఘటన జరిగిన కాసేపటికి తాను అధికారులను దూషించలేదంటూ సదరు కాంట్రాక్టర్ ఒక వీడియో విడుదల చేశారు. స్థానికంగా ఉన్న మున్సిపల్ అధికారులు తన నుంచి కమీషన్లు ఆశిస్తున్నారని, అవి ఇవ్వకపోవడంతో తన బిల్లులు పెండింగ్‌లో పెడుతున్నారని ఆరోపించారు. బిల్లుల కోసం ఇప్పటి వరకూ నాలుగుసార్లు కలెక్టర్‌ను కలిసి విన్నవించానన్నారు. పిఠాపురంలో ఏర్పాటు చేసిన పిజిఆర్ కార్యక్రమానికి ఇదే విషయమై వెళ్లానన్నారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న సందర్భంలో జనసేన, టిడిపి నాయకులు కలిసి తనను అవహేళన చేసే విధంగా మాట్లాడడంతో సహనం కోల్పోయానన్నారు. వారిని మాత్రమే దూషించానని, అధికారులను దూషించానని వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు.

సంపాదకీయం

కార్పొరేట్ విజన్

ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం శుక్రవారం ఆవిష్కరించిన 'స్వర్ణాంధ్ర విజన్-2047' డాక్యుమెంట్ నయా-ఉదారవాద విధానాలు మరింత శీఘ్రగతి అమలుకు రోడ్ మ్యాప్. కార్పొరేట్ల అడ్డూఅదుపు లేని దోపిడీకి ఎర్ర తివాచీ. వికసిత భారత్ నిర్మాణం కోసం కేంద్రంలో నరేంద్ర మోడీ తీసుకొచ్చిన 'విజన్-2047'లో భాగంగా రాష్ట్రంలోనూ తీసుకొచ్చామని చంద్రబాబు, కూటమి నేతలు ప్రకటించారు. కేంద్రంలో బిజెపి ప్రతిపాదించిన విజన్‌లో అణువణువూ మతతత్వ-కార్పొరేట్ జమిలి విధానాల కలబోత కాగా అందులో భాగమే తమ 'కల' అంటున్నారు చంద్రబాబు. ప్రజలందరికీ సంపద, ఆరోగ్యం, సంతోషం అందించడమే లక్ష్యమని చెబుతున్నారు. పేదరికం లేని సమాజం, ఉపాధి- ఉద్యోగ కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, ఇత్యాది పది సూత్రాలు తమ విజన్‌కు ప్రాతిపదికగా పేర్కొన్నారు. 2047 నాటికి అందరికీ అక్షరాస్యత, 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 42 వేల డాలర్ల తలసరి ఆదాయం, 60 శాతానికి పట్టణ జనాభా, రెండు శాతానికి నిరుద్యోగిత రేటు తగ్గింపు, 85 సంవత్సరాల సగటు ఆయు ప్రమాణం, 450 బిలియన్ డాలర్ల ఎగుమతులు లక్ష్యాలుగా ప్రకటించారు. ఈ 'కలలు' ఆకర్షణీయంగానే కనిపిస్తున్నప్పటికీ వాటి సాధనకు ఎంచుకున్న విధానాలే సదరు కలలను కల్లలు చేస్తాయి.

రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పి-4 విధానాన్ని తారకమంత్రంగా జపిస్తోంది. ఇప్పటి వరకు మూడు 'పి' లు... పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) వాడుకలో ఉంది. కొత్తగా పీపుల్, పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపిపి)... నాలుగు 'పి' ల ఫార్ములా తెర మీదికి తెచ్చారు. అందులో భాగంగానే విజన్ డాక్యుమెంట్ విడుదల వేదికపై నుంచి ఎక్కడ పరిశ్రమ వస్తే అక్కడి రైతులు భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపునిచ్చినట్లున్నారు. దానర్థం కార్పొరేట్లు పరిశ్రమలు, ప్రాజెక్టులు పెడతారు. అందుకు కావాల్సిన భూములను రైతులు త్యజించాలన్నమాట. రైతుల భూములను కార్పొరేట్లకు ధారాదత్తం చేసే కుట్ర పి-4 సిద్ధాంతం వెనుక దాగుంది. ఇప్పటికే మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోనిటైజేషన్ పైప్‌లైన్ అంది. అడవులను, నదులను, సముద్రాలను, చివరికి జాతీయ రహదారుల, రైల్వే ట్రాక్‌ల వెంబడి భూములను సైతం కార్పొరేట్లకు అప్పగిస్తోంది. చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్ అందుకు భిన్నమైంది కాదు. ఆర్థిక హబ్‌లు, హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్, రెండు మెగా పోర్టులు, రీసైక్లింగ్ క్లస్టర్, నౌకా నిర్మాణం, టూరిజం ప్రాజెక్టులు, ఎ.ఐ, డ్రోన్లు.. ఇవన్నీ ప్రైవేట్ కార్పొరేట్ల ప్రాపకం కోసమే. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాస్తా స్పీడ్ ఆఫ్ బిజినెస్‌గా మారిందీ అందుకే. ఇప్పటికే జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అదానీ ప్రదేశ్‌గా మార్చింది. పోర్టులు, విద్యుత్, సకలం అదానీకి సమర్పించారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందన్న కూటమి తాను కూడా అదే బాటలో పయనిస్తోందనడానికి సెకితో సౌర విద్యుత్ ఒప్పందం కొనసాగింపే ఉదాహరణ.

చంద్రబాబు విజన్లు కొత్తవేమీ కావు. 1999 ప్రాంతంలో బ్రిటీష్ మెకెన్సీ కన్సల్టెన్సీ రూపొందించిన 'విజన్ 2020'తో ఊదరగొట్టారు. రాష్ట్ర విభజన అనంతరం 'విజన్ 2029' అన్నారు. ఇప్పుడేమో ఏకంగా రాబోయే 23 ఏళ్లకు 'విజన్-2047' అంటున్నారు. విభజన అనంతరం అవశేష ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని దృష్టిలో పెట్టుకోకుండా విజన్లు అనడం ప్రజలను మభ్యపెట్టడానికే. వ్యవసాయ రాష్ట్రమైన ఎ.పి.లో వ్యవసాయం సంక్షోభంలో ఉంది. రైతుల, కౌలు రైతుల, వ్యవసాయ కార్మికుల బతుకులు ఆందోళనకరంగా తయారయ్యాయి. వారి ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర రైతుల్లో 93 శాతం మంది రుణగ్రస్తులు. సగటు అప్పు రూ.2.45 లక్షలు. ఈ రెండు అంశాల్లో దేశంలో మనమే టాప్. తలసరి ఆదాయంలో 15వ స్థానంలో ఉన్నాం. నిరుద్యోగం, విద్య, వైద్యం, మహిళా, శిశు మరణాలు, వారి సంక్షేమం, ఈ రంగాలన్నీ కునారిల్లుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం రహదార్లు మట్టి రోడ్లు. గుంతలు లేని తారురోడ్లను లక్ష్యంగా ఎంచుకున్న దుస్థితి. విజన్ అనేది నేల విడిచి సాము చేయకూడదు. విస్తృత స్థాయి చర్చలతో రూపొందాలి. ప్రజల మధ్య అసమానతలు రూపుమాపేది అసలైన దార్శనికత.

మహనీయుల మాట



సంపద సముద్రపు నీరు లాంటిది. మనం ఎంత ఎక్కువ తాగితే అంత ఎక్కువ దాహం అవుతుంది.

- ఆర్థర్ స్కోపెన్ హౌర్, జర్మన్ తత్వవేత్త.

డాలర్ పెత్తనం



తమ దేశీయ అవసరాలకు కావలసిన దిగుమతులను అవి డాలర్ ప్రమేయం లేని వ్యాపారం ద్వారా పొందవచ్చు. కాని ఇప్పటికే ఆ దేశాలు ఐ.ఎం.ఎఫ్ లేదా ప్రపంచ బ్యాంక్ దగ్గర రుణాలు పొందివుంటే ఆ రుణాలకు చెల్లించవలసిన వాయిదాలు డాలర్ల రూపంలోనే చెల్లించాలి. ఆ డాలర్ల నిల్వలు హరించుకుపోతే అప్పుడు ఆ దేశాలు రుణ ఎగవేతదారులుగా నిలబడవలసి వస్తుంది. దాని వలన కొత్త షరతులను భరించవలసి వస్తుంది. అందుచేత ట్రంప్ ప్రకటిస్తున్న హెచ్చరికలను సీరియస్‌గానే తీసుకోవాలి. ఉదారవాద ఆర్థికవేత్తలు ఎంతో సౌమ్యంగా చిత్రించే సామ్రాజ్యవాదపు ఆధిపత్య రూపం కాస్తా ఇప్పుడీ ట్రంప్ బెదిరింపులతో పూర్తిగా బైటపడి పోయింది !



ప్రభాత్ పట్నాయక్

అంతర్జాతీయ ఆర్థిక, ద్రవ్య వ్యవస్థ ద్వారా అన్ని దేశాలకూ సౌకర్యంగా ఉండే ఒక చెల్లింపుల విధానాన్ని రూపొందించుకుని ఆ ప్రాతిపదికన వాణిజ్యాన్ని కొనసాగించవచ్చునని ఉదారవాద ఆర్థికవేత్తలు భావిస్తారు. కాని వాస్తవం అందుకు పూర్తి భిన్నం. పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల పెత్తనం మీద ఆధారపడి అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పడింది. ఈ ఆర్థిక, ద్రవ్య వ్యవస్థ తిరిగి అదే సామ్రాజ్యవాదానికి దన్నుగా నిలబడుతుంది. ఈ అంతర్జాతీయ వ్యవస్థకు ఇరుసుగా అమెరికన్ డాలర్ ఉంది. అంటే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో డాలర్ పెత్తనం చెలాయించడం వెనుక పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల దన్ను ఉంది. అదే డాలర్ ఆధిపత్యం తిరిగి ఆ పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల ఆధిపత్యానికి దన్నుగా ఉంటోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో పాల్గొనే వివిధ దేశాల మధ్య పరస్పరం జరిగే వాణిజ్యానికి ఈ డాలర్ పెత్తనం ప్రతిబంధకంగా ఉంటోంది.

దీనిని ఒక ఉదాహరణతో వివరిస్తాను: 1వ దేశానికి 'క' అనే సరుకు అవసరం అనుకోండి. అది 2వ దేశం తయారు చేస్తోంది. ఈ 2వ దేశానికి 'చ' అనే సరుకు అవసరం అనుకోండి. దానిని 1వ దేశం తయారు చేస్తోంది. అప్పుడు ఈ రెండు దేశాలూ ఆ రెండు సరుకులనూ పరస్పరం మార్పిడి చేసుకోవచ్చు కదా. కాని ప్రస్తుత అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ ప్రకారం అలా మార్పిడి చేసుకోడానికి వీలు లేదు. ఆ రెండు దేశాలవద్దా తమకు కావలసిన సరుకులను కొనుగోలు చేయడానికి సరిపడా డాలర్ నిల్వలు ఉండాలి. అలా లేకపోతే ఆ రెడు దేశాలూ తమ సరుకులను మార్పిడి చేసుకోలేవు. అంతర్జాతీయ వ్యాపారం యావత్తూ డాలర్ కరెన్సీతోనే సాగుతుంది. ఈ నిబంధన గనుక లేకపోతే చాలా దేశాలు తమ తమ సరుకులను తక్కిన దేశాలతో తేలికగా మార్చుకోవచ్చు. డాలర్ మీద ఆధారపడడం అనేది తగ్గితే అది అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభతరం చేస్తుంది.

ఈ విధంగా డాలర్ మీద ఆధారపడడం తగ్గితే అది అమెరికాకు అంగీకారంగా ఉండదు. ప్రపంచం అంతా డాలర్‌ను మారకపు సాధనంగా అంగీకరించడం, డాలర్ రూపంలో నిల్వ ఉంటే అది బంగారపు నిల్వతో సమానం అన్న అభిప్రాయం ప్రబలంగా ఉండడం అనేది అమెరికాకు చాలా పైచేయిని కల్పిస్తుంది. అమెరికా ఇప్పుడు ఎన్నటికీ తరగని ఒక బంగారపు గని మీద దర్జాగా కూర్చుని వుంది. ఇతర దేశాల నుండి తనకు కావలసిన వనరులను అది కొనుగోలు చేయవచ్చు, సంస్థలనే కొనుగోలు చేయవచ్చు, విదేశాలలో ఎంత కావాలంటే అంత పెట్టుబడి పెట్టవచ్చు. తన విదేశీ వ్యాపారంలో లోటు గనుక ఏర్పడితే దానిని పూడ్చుకోడానికి ఎన్ని డాలర్లు కావాలంటే అన్నింటిని ముద్రించుకోవచ్చు.

ఇలా అపరిమితమైన కొనుగోలు శక్తిని అంతర్జాతీయ వాణిజ్య రంగంలో కలిగివుండడమే కాదు. ఇతర దేశాల మెడలు వంచి అవి తన పెత్తనానికి లోబడి వుండేలా చేయడానికి కూడా డాలర్ పెత్తనం తోడ్పడుతుంది. ఆ యా దేశాల డాలర్ నిల్వలు సాధారణంగా పశ్చిమ దేశాల బ్యాంకుల్లోనే భద్రపరచడం జరుగుతుంది. అందుచేత అమెరికా తనకు నచ్చిన దేశానికి కావలసినంత మేరకు డాలర్ల ప్రవాహాన్ని పంపనూవచ్చు. తనకు నచ్చనప్పుడు ఆ దేశపు బ్యాంక్ అకౌంట్లను స్తంభింపజేసి డాలర్ల కొరతనూ సృష్టించవచ్చు. ఇరాన్ నుండి రష్యా వరకూ అనేక దేశాలు ఈ విధంగా శిక్షలు అనుభవిస్తున్నాయి. ఈ విధంగా వివిధ దేశాల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం ఈ మధ్య కాలంలో మరీ ఎక్కువైంది. దాంతో డాలర్ ప్రమేయం లేని వ్యాపారం కావాలన్న డిమాండ్ ఆ డాలర్ల కొరతను ఎదుర్కొంటున్న దేశాల నుండి పెరుగుతోంది.

ప్రస్తుతం దాదాపు మూడో వంతు ప్రపంచ దేశాలు అమెరికా నుండి ఇటువంటి శిక్షలను ఎదుర్కొంటున్నాయి. అయితే ఆ విధంగా శిక్షించడానికి ఐరాస నుండి అమెరికాకు ఎటువంటి అనుమతీ లేదు. దక్షిణాఫ్రికా దేశం జాతి వివక్షతను పాటించిన కాలంలో అంతర్జాతీయ సమాజం ఆదేశాన్ని శిక్షించడానికి ఆమోదం ఇచ్చింది. అటువంటి సందర్భాలేవీ లేకపోయినా అమెరికా తన పెత్తనాన్ని చెలాయిస్తూ తనకు లొంగని దేశాల ఖాతాలను స్తంభింపజేస్తూ వాటిని ఇబ్బందుల పాలు చేస్తోంది. వాటిలో మూడవ ప్రపంచ దేశాలు ఎక్కువగా ఉన్నాయి. అమెరికా కన్నెర్రకు గురైన దేశాలు ఇప్పుడు డాలర్ ప్రమేయం లేని అంతర్జాతీయ వాణిజ్యం కావాలని కోరు కుంటున్నాయి. ఇటీవల కాజన్‌లో జరిగిన 'బ్రిక్స్' దేశాల శిఖరాగ్ర సమావేశంలో ఈ ఆకాంక్ష బలంగా వ్యక్తం అయింది.

తమ పెత్తనం వల్లే ఇటువంటి ఆకాంక్షలు తలెత్తుతున్నాయని అమెరికన్ ప్రభుత్వం సైతం గుర్తించింది. అమెరికన్ ఆర్థిక శాఖ మంత్రి జానెట్ యెల్లెన్ జులైలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ "అమెరికా ఆంక్షలు ఎన్ని ఎక్కువ దేశాల మీద విధిస్తే అన్ని ఎక్కువ దేశాలు అమెరికన్ డాలర్ ప్రమేయం లేని వ్యాపారం కావాలని కోరుకుంటాయి." అన్నారు. తన అడుగులకు మడుగులొత్తేలా ఒత్తిడి చేయడానికి అమెరికా ఆంక్షల బెదిరింపును వాడుకుంటోందని యెల్లెన్ చెప్పకనే చెప్పారు. అలా బెదిరింపులకు బలౌతున్న దేశాల సంఖ్య పెరుగు తున్న సంగతినీ అంగీకరించారు.

ఇలా ఏకపక్షంగా ఆంక్షలు విధించడం ద్వారా పెత్తనాన్ని చెలాయించేందుకు పూనుకోవడం వలన పరస్పర విరుద్ధ ఫలితాలు వస్తాయి. ఒకటో, రెండో దేశాల మీద ఆంక్షలు విధిస్తే అప్పుడు వాటి ప్రభావమూ గట్టిగా ఉంటుంది, ఆ ఆంక్షలు మొత్తం వ్యవస్థకూ ముప్పు తెచ్చిపెట్టవు. అదే అనేక దేశాల మీద ఆంక్షలు విధిస్తే అప్పుడు మొత్తం వ్యవస్థకే ముప్పు వాటిల్లుతుంది. నయా ఉదారవాద విధానాల ఫలితంగా పేదరికంలోకి దిగజారి పోతున్న దేశాల సంఖ్య పెరుగుతోంది. అందుచేత ఎదురు తిరిగే దేశాల సంఖ్య రానున్న కాలంలో ఇంకా పెరిగే అవకాశాలున్నాయి. వాటి మీద ఆంక్షలూ పెరుగుతాయి. అప్పుడు ఈ డాలర్ పెత్తనమే వద్దనే దేశాల సంఖ్యా పెరుగుతుంది. డాలర్‌ను అంతర్జాతీయ మారకపు సాధనంగా ఉపయోగించడం వలన అమెరికా దానిని అడ్డం పెట్టుకుని వివిధ దేశాల మెడలు వంచి వాటిపై తన పెత్తనాన్ని చెలాయించడం వల్లనే ఇలా జరుగుతోంది. అందుచేత డాలర్ మారకపు కరెన్సీగా ఉండడం అనేది అంతర్జాతీయ వాణిజ్యంలో అన్ని దేశాలకూ ప్రయోజనకరంగా ఉంటుందని ఉదారవాద ఆర్థికవేత్తలు చెప్తున్నది ఎంత డొల్ల వాదనో స్పష్టంగా తెలుతోంది.

డాలర్ ఈ విధంగా పెత్తనం చెలాయించగలగడానికి ఒక కారణం 1970 దశకంలో అమెరికాకు, చమురు ఉత్పత్తి దేశాలకు నడుమ కుదిరిన ఒప్పందం. ఆ ఒప్పందాన్ని సౌదీ అరేబియా మధ్యవర్తిత్వంతో కుదుర్చుకున్నారు. దాని ప్రకారం అంతర్జాతీయంగా ముడిచమురు ధరలను డాలర్లలో నిర్ణయిస్తారు. ఆ డాలర్లలోనే ఆ చమురు వ్యాపారం సాగుతుంది. చమురుకు ఉన్న ప్రాధాన్యత రీత్యా ఈ ఒప్పందం తర్వాత డాలర్ ప్రాధాన్యత ఒక్కసారి పెరిగింది. ముడి చమురుకు ఇటువంటి ప్రాధాన్యత ఉంది కనుకనే ఇటీవల పశ్చిమ దేశాలు రష్యాపై ఆంక్షలు విధించాక వాటి నుండి తట్టుకోడానికి రష్యా తన ముడిచమురు కొనుగోలు చేసేవారు రూబుళ్ళలోనే చెల్లింపులు చేయాలని నిబంధన విధించింది.

అయితే, 1970 దశకంలో కుదిరిన ఆ ఒప్పందం ఒక్కటే డాలర్ ఆధిపత్యం నేటికీ కొనసాగడానికి కారణం కాబోదు. డాలర్ ప్రమేయం లేకుండా అంతర్జాతీయ వ్యాపారం జరగాలన్న భావననే జానెట్ యెల్లెన్ మొదట్లో తేలికగా కొట్టిపారేశారు. కాని ఇప్పుడు ఆమె ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవలసి వస్తోంది. ఇప్పుడు ట్రంప్ డాలర్ పెత్తనాన్ని కాదనుకుంటున్న దేశాలను బెదిరించడానికి పూనుకుంటున్నాడు. అమెరికాకు ఆ దేశాలు ఎగుమతి చేసే సరుకులపై సుంకాన్ని 100 శాతం పెంచుతానంటూ రంకెలు వేస్తున్నాడు. అంటే డాలర్ పెత్తనం ఎలాగైనా కొనసాగడానికి అమెరికన్ సామ్రాజ్యవాదం తన శక్తిని వినియోగిస్తోందన్న మాట.

ఇటువంటి బెదిరింపుల ప్రభావం బలంగానే ఉంటుంది. ఎందుకంటే డాలర్ ప్రమేయం లేకుండా వ్యాపారం చేసుకోవడం అనేది ఒక్క పట్టున సాధ్యపడేది కాదు. ఈలోపున అమెరికాకు ఆ దేశాలు చేసే ఎగుమతులు కుదించుకుపోతే అప్పుడు ఆ దేశాల దగ్గరుండే డాలర్ నిల్వలు మరీ వేగంగా హరించుకుపోతాయి. అప్పుడు ఆ దేశాలు మరింతగా ఇబ్బందుల పాలౌతాయి. తమ దేశీయ అవసరాలకు కావలసిన దిగుమతులను అవి డాలర్ ప్రమేయం లేని వ్యాపారం ద్వారా పొందవచ్చు. కాని ఇప్పటికే ఆ దేశాలు ఐ.ఎం.ఎఫ్ లేదా ప్రపంచబ్యాంక్ దగ్గర రుణాలు పొందివుంటే ఆ రుణాలకు చెల్లించవలసిన వాయిదాలు డాలర్ల రూపంలోనే చెల్లించాలి. ఆ డాలర్ల నిల్వలు హరించుకుపోతే అప్పుడు ఆ దేశాలు రుణ ఎగవేతదారులుగా నిలబడవలసి వస్తుంది. దాని వలన కొత్త షరతులను భరించవలసి వస్తుంది. అందుచేత ట్రంప్ ప్రకటిస్తున్న హెచ్చరికలను సీరియస్‌గానే తీసుకోవాలి. ఉదారవాద ఆర్థిక వేత్తలు ఎంతో సౌమ్యంగా చిత్రించే సామ్రాజ్య వాదపు ఆధిపత్య రూపం కాస్తా ఇప్పుడీ ట్రంప్ బెదిరింపులతో పూర్తిగా బైటపడి పోయింది!

అయితే ఈ బెదిరింపులను ఎదుర్కొనే దేశాలు డాలర్ పెత్తనం నుండి బైటపడవలసిన అవసరాన్ని మరింతగా గుర్తించడానికే ఈ బెదిరింపులు తోడ్పడతాయి. డాలర్-రహిత అంతర్జాతీయ వ్యాపారం పుంజుకోడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. ఈ సంగతి కజన్ శిఖరాగ్ర సమావేశానికీ తెలుసు. ట్రంప్ బెదిరించగానే భారత దేశంతో సహా పలు దేశాలు తమకు ఈ డాలర్-రహిత వాణిజ్యం పట్ల ఆసక్తి లేదంటూ ప్రకటించాయి. అమెరికా దృష్టిలో బుద్ధిమంతులని పించుకోడానికి ఈ ప్రకటనలు ఉపయోగ పడవచ్చు. కాని అమెరికా పెత్తనానికి సవాలు తీవ్రంగానే ఎదరవుతోందన్నది మాత్రం వాస్తవం. తమ దేశాల ఆధిపత్యానికి సవాలు తీవ్రంగా ఎదురవుతోందన్న వాస్తవాన్ని గుర్తించిన పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల ప్రభుత్వాలే కాకుండా ఆ దేశాల్లోని సోషల్ డెమాక్రటిక్ పార్టీలు సైతం ఉక్రెయిన్ విషయంలో గాని, గాజా విషయంలో గాని మరింత ఐక్యంగా వ్యవహరిస్తున్నాయి.

సామ్రాజ్యవాదానికి ఎదురౌతున్న సవాలులో డాలర్-రహిత అంతర్జాతీయ వ్యాపారం అనే డిమాండ్ కూడా ఒక భాగమే. అయితే డాలర్‌కు ప్రత్యామ్నాయంగా ఏ విధమైన అంతర్జాతీయ వ్యవస్థను ఏర్పరచాలన్న విషయం మీద ఇంకా బ్రిక్స్ దేశాల నడుమ ఒక స్పష్టత రాలేదు. ఇలా ఏర్పడే ఆ ప్రత్యామ్నాయ వ్యవస్థ డాలర్‌కు బదులు మరొక దేశపు కరెన్సీకి ఆధిపత్యాన్ని కట్టబెట్టేదిగా మాత్రం ఉండకూడదు.

అలా జరగాలంటే ఇప్పుడు ఏ సూత్రాల ప్రాతిపదికపై అంతర్జాతీయ వాణిజ్యం సాగు తోందో ఆ సూత్రాలే, ఆ నియమాలే మారిపోవాలి. అంతే కాదు. అంతర్జాతీయ వాణిజ్యంలో వాణిజ్య లోటు పెరుగుతున్న దేశాల మీద ఆ లోటును భర్తీ చేసే భారాన్ని మోపే పద్ధతి కూడా మారాలి. బ్రెట్టన్‌వుడ్ వ్యవస్థ పర్యవసానం ఇది. నిజానికి సర్దుబాటు జరగాలంటే అది మిగులు ఉన్న దేశాల వైపు నుంచి మొదలు కావాలి.

(స్వేచ్ఛానుసరణ)

ఇప్పుడు ట్రంప్ డాలర్ పెత్తనాన్ని కాదనుకుంటున్న దేశాలను బెదిరించడానికి పూనుకుంటున్నాడు. అమెరికాకు ఆ దేశాలు ఎగుమతి చేసే సరుకులపై సుంకాన్ని 100 శాతం పెంచుతానంటూ రంకెలు వేస్తున్నాడు. అంటే డాలర్ పెత్తనం ఎలాగైనా కొనసాగడానికి అమెరికన్ సామ్రాజ్యవాదం తన శక్తిని వినియోగిస్తోందన్నమాట. ఇటువంటి బెదిరింపుల ప్రభావం బలంగానే ఉంటుంది. ఎందుకంటే డాలర్ ప్రమేయం లేకుండా వ్యాపారం చేసుకోవడం అనేది ఒక్క పట్టున సాధ్యపడేది కాదు. ఈలోపున అమెరికాకు ఆ దేశాలు చేసే ఎగుమతులు కుదించుకుపోతే అప్పుడు ఆ దేశాల దగ్గరుండే డాలర్ నిల్వలు మరీ వేగంగా హరించుకుపోతాయి. అప్పుడు ఆ దేశాలు మరింతగా ఇబ్బందుల పాలౌతాయి.

వలస కూలీల నాట్లు-ఊళ్లో కూలీల అగచాట్లు

"ఎక్కడో వేల కిలో మీటర్ల దూరం నుండి ప్రధానంగా బీహార్, బెంగాల్ ప్రాంతాల నుండి పేదలు పొట్ట చేత పట్టుకొని మహిళలను, పసిబిడ్డలను తీసుకొని ఇక్కడి గ్రామాలకు వస్తున్నారు. మధ్యవర్తులు, డీలర్లు చూపిన పశువుల కొట్టాలు, పాడుబడిన ఇళ్లు, బస్ షెల్టర్లు, మొండి గోడల మధ్య ప్లాస్టిక్ కవర్లు కప్పుకొని మురికి కూపాలలో, పురుగు, పుట్ర లెక్క చేయకుండా బిక్కు బిక్కుమంటూ దుర్భరంగా జీవిస్తూ కాయకష్టం చేస్తున్నారు. వీళ్ళు కూడా కాంట్రాక్టు పద్ధతులలోనే నాట్లు వేస్తున్నారు. ఒక ఎకరా నారు పెరికి నారు మోసుకొని నాట్లు వేస్తే మధ్యవర్తి రైతు దగ్గర రూ.4500 నుండి రూ.4600 తీసుకుంటారు. డిమాండ్ ఎక్కువైతే రూ.5000 వరకు తీసుకొని వీరికి మాత్రం కేవలం రూ.3200, రూ.3500 మాత్రమే ఇస్తున్నారు. మిగిలిన డబ్బులు వసతుల పేరు మీద (గ్యాస్, బియ్యం, గోధుమ పిండి, కూరగాయలు, ఆటో ట్రాన్స్‌పోర్టు) మధ్యవర్తులు, డీలర్లు కాజేస్తున్నారు."





పుల్లయ్య మంగళ

ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో కురవడంతో రాష్ట్రంలో ప్రాంతాలను బట్టి, వాతావరణాన్ని బట్టి సకాలంలో వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. ఉత్తరాంధ్ర, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, కర్నూలు, ప్రకాశం ప్రాంతాలలో జులై, ఆగష్టు మాసాలలో, దక్షిణ ప్రాంతాలైన నెల్లూరు, చిత్తూరు, కడపలలో లేట్ ఖరీఫ్ అక్టోబర్, నవంబర్ నెలలో ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ ప్రాంతాలలో ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. ప్రధానమైన పంట వరి. అలాగే మెట్ట ప్రాంతాలలో వివిధ రకాలైన పంటలు కూడా సాగవుతున్నాయి.

గ్రామాల్లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నా స్థానిక వ్యవసాయ కూలీలకు మాత్రం పనులు దొరకడం లేదు. సంవత్సరం మొత్తం మీద 30 రోజుల కూడా కూలీ పనులు వుండటం లేదు. కారణం ముఖ్యంగా వ్యవసాయంలో యంత్రాలు రావడం. పంటల సాగులో మార్పులు రావడం (ఉదా: డ్రమ్ సీడింగ్ చల్లటం లాంటి పనులు). ప్రస్తుతం 'వలస కూలీలు' మరో ముఖ్య కారణం. బయట రాష్ట్రాల నుండి (బెంగాల్, బీహార్) కూలీలు రావడంతో స్థానిక కూలీలకు పనులు దొరకడం లేదు. కూలీలు గ్రామాల్లో పనులు లేకపోవడంతో పట్టణ ప్రాంతాలకు వ్యవసాయేతర పనులకు వెళుతున్నారు. ప్రధానంగా ఇటుకబట్టీ పనులు, భవన నిర్మాణ పనులు, హోటళ్ళలో క్లీనింగ్ పనులకు, అలాగే పట్టణాల్లో ఇళ్ళలో పాచి పనులకు (మహిళలు) వెళుతున్నారు. ఒక వేళ కూలి దొరికినా కనీస వేతనం వచ్చే పరిస్థితి లేదు. నారువేతలు మొత్తం కాంట్రాక్ట్ పద్ధతిలో ఎక్కువ శ్రమను ధారపోయాల్సిన పరిస్థితి వస్తున్నది. ఉదయం 6.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు ఒళ్ళు హూనం అయ్యేలా పనిచేస్తే కేవలం రూ.500, రూ.600 వచ్చే పరిస్థితి. ఇది ఊళ్ళో కూలీల పరిస్థితి.

వలస కూలీల పరిస్థితి

ఎక్కడో వేల కిలో మీటర్ల దూరం నుండి ప్రధానంగా బీహార్, బెంగాల్ ప్రాంతాల నుండి పేదలు పొట్ట చేత పట్టుకొని మహిళలను, పసిబిడ్డలను తీసుకొని ఇక్కడి గ్రామాలకు వస్తున్నారు. మధ్యవర్తులు, డీలర్లు చూపిన పశువుల కొట్టాలు, పాడుబడిన ఇళ్లు, బస్ షెల్టర్లు, మొండి గోడల మధ్య ప్లాస్టిక్ కవర్లు కప్పుకొని మురికి కూపాలలో, పురుగు, పుట్ర లెక్క చేయకుండా బిక్కు బిక్కుమంటూ దుర్భరంగా జీవిస్తూ కాయకష్టం చేస్తున్నారు. వీళ్ళు కూడా కాంట్రాక్టు పద్ధతులలోనే నాట్లు వేస్తున్నారు. ఒక ఎకరా నారు పెరికి నారు మోసుకొని నాట్లు వేస్తే మధ్యవర్తి రైతు దగ్గర రూ.4500 నుండి రూ.4600 తీసుకుంటారు. డిమాండ్ ఎక్కువైతే రూ.5000 వరకు తీసుకొని వీరికి మాత్రం కేవలం రూ.3200, రూ.3500 మాత్రమే ఇస్తున్నారు. మిగిలిన డబ్బులు వసతుల పేరు మీద (గ్యాస్, బియ్యం, గోధుమ పిండి, కూరగాయలు, ఆటో ట్రాన్స్‌పోర్టు) మధ్యవర్తులు, డీలర్లు కాజేస్తున్నారు. ఒక్క నెల్లూరు జిల్లాలోనే ఈ లేట్ ఖరీఫ్‌లో 9 లక్షల ఎకరాల వరి సాగు జరుగుతుంది. స్థానిక కూలీలు 2 లక్షల ఎకరాల వరకు నాట్లు వేస్తున్నారు. మిగిలిన పొలమంతా కూడా రైతాంగం బెంగాల్ కూలీల చేతనే నాట్లు వేయిస్తున్నారు. వీళ్ళ చేత నాట్లు వేయించుకుంటే రైతుకు ఎటువంటి కష్టం లేకుండా ఇబ్బందులు లేకుండా శనగలు తిని, చెయ్యి కడుక్కున్నట్లుగా అన్ని పనులు కూలీలే చూసుకుంటారు (నారు పీకడం, నారు మోసుకోవడం, సాళ్ల తీయడం లాంటి పనులు). రైతులు కూడా వ్యవసాయానికి నారుమళ్లు సిద్ధం చేసే సమయంలోనే బెంగాల్ కూలీలను దృష్టిలో పెట్టుకొని నార్లు పోసుకుంటున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ప్రస్తుతం సుమారు 50 వేల మంది వరకు బెంగాల్ కూలీలు వున్నారంటే పరిస్థితి ఏ స్థితిలో వుందో ఒకసారి ఆలోచించాలి. వ్యవసాయ సీజన్ మధ్యలో వచ్చినా ఇప్పటికి కూడా నెల్లూరు, కావలి, గూడూరు రైల్వే స్టేషన్లలో వలస కూలీలు దిగుతూనే వున్నారు. ప్లాట్‌ఫారమ్‌ల మీద మూటలతో పనికి పిలిచే వారి కోసం స్టేషన్లలో పడిగాపులు కాస్తున్నారు. రాష్ట్రం కాని రాష్ట్రం, జిల్లా కాని జిల్లా, ఊరు కాని ఊరు వచ్చిన కూలీలకు, మరీ ముఖ్యంగా మహిళలకు రక్షణ లేదు. వాళ్ళ అవసరాలకు చాటు మాటు లేదు. అనేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కొన్ని చోట్ల పసిపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా పని ప్రదేశంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఆదుకునే దిక్కు లేదు. ఈ మధ్యనే నెల్లూరు జిల్లాలో కూలీలు వెళుతున్న ఆటోలు, ట్రాక్టర్లు బోల్తా పడి ఇద్దరు వలస కూలీలు చనిపోయిన పరిస్థితి. మరికొంత మందికి తీవ్రగాయాలై నెల్లూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో, మరికొంతమంది ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం వారికి అండగా నిలిచి, చనిపోయిన కూలీలకు రైతుల చేత నష్టపరిహారం కట్టించి, వారి శవాలను వారి స్వగ్రామాలకు పంపించడానికి ప్రయత్నం చేసింది. అలాగే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరింది. ఇంకా అనేక చోట్ల ప్రమాదాలు జరుగుతూనే వున్నాయి. ఇలాంటి పరిస్థితులలో వలస కార్మికులు ఎన్నో కష్టాలు పడుతున్నారు. ఇన్ని కష్టాలు పడి చేసిన శ్రమకు తగిన ఫలితం దక్కుతుందా అంటే అదీ లేదు. ఉదయం 5.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు పని చేస్తే వచ్చిన కూలి డబ్బులు కూడా వీళ్ళకు పూర్తిగా దక్కే పరిస్థితి లేదు.

వ్యవసాయ కార్మికుల పట్ల ప్రభుత్వాల చిన్నచూపు

దేశానికి అన్నం పెడుతున్న రైతాంగానికి వ్యవసాయ కార్మికులకు పాలకులు మొండి చేయి చూపిస్తున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదు. మద్దతు ధర చట్టం చేస్తానని చెప్పిన ప్రధానమంత్రి మాట తప్పి మోసం చేస్తున్నారు. అదే విధంగా వ్యవసాయాన్నే నమ్ముకున్న వ్యవసాయ కూలీలకు 6 గంటలు పని చేస్తే నారువేతల్లో జోన్ల ప్రకారం (మొదటి జోన్‌లో 443 రూపాయలు, రెండవ జోన్‌లో 438 రూపాయలు) కనీస వేతనం ఇవ్వాలని కేంద్ర కార్మిక శాఖ చట్టం చేసి చెబుతున్నా... ఇక్కడ కూలీలకు మాత్రం రూ.200 మించి ఎక్కడా రావడం లేదు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని కార్మికశాఖ జీవో విడుదల చేసినా...జిల్లా అధికారులు, మండల అధికారులు, గ్రామ అధికారులు ఎక్కడా ఆ జీవోని కూలీలకు, రైతులకు తెలియజేసి కూలీలకు జీవో ప్రకారం వచ్చే విధంగా చర్యలు చేపట్టడం లేదు. గ్రామాలలో వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు పడుతున్న వ్యవసాయ కార్మికుల కోసం 2005లో వామపక్షాలు పోరాడి తెచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి ప్రస్తుత ఎన్.డి.ఎ. ప్రభుత్వం నిధులు తగ్గించడమేగాక, వాటిని కూడా విడుదల చేయకుండా నిర్వీర్యం చేసే కుట్ర పన్నింది. ఈ చట్టం సక్రమంగా గ్రామాలలో అమలు జరిగితే కూలీల వలసలు తగ్గి, వారి జీవన స్థితి మెరుగుపడుతుంది. కానీ ఆ దిశగా ప్రభుత్వాలు చేయడం లేదు. మరోవైపు పేదలకు విద్య, వైద్యం, నిలువ నీడ కూడా లేని పరిస్థితి గ్రామాల్లో ఉంది. రైతులకు మద్దతు ధరకు చట్టం, వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం రూపొందించాలి. దాన్ని సక్రమంగా అమలు చేయాలి. అందుకు గ్రామీణ ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలి.

/వ్యాసకర్త ఎ.పి వ్యవసాయ కార్మిక సంఘం నెల్లూరు జిల్లా కార్యదర్శి,
సెల్: 9440740555/

కవిత్వం


సమ్మె

మొక్కలు సమ్మె చేస్తున్నాయ్!
కాల మార్పుల్ని ధిక్కరిస్తూ....
పూల నిప్పుల్ని పుక్కిలిస్తూ ...
మొక్కలు సమ్మె చేస్తున్నాయ్!
ఆకలి కడుపులకు
అన్నమౌతోన్న మొక్కలు!
బాహ్య ప్రకృతికి ప్రాణ పరిమళాలద్ది
బతుకు వాకిళ్ళలో వెలుగుముగ్గులు దిద్దే
వన్నె చిన్నెల పూల మొక్కలు!
తియ్య తియ్యని పండ్ల మొక్కలు!
శరీర ఆరోగ్యాన్ని చక్కబరిచే
చల్ల చల్లని మనసు మొక్కలు!
సమ్మె చేస్తున్నాయ్ దిమ్మతిరిగేలా...!
అనేక మొక్కలు ఏక తాటిపై
కొమ్మల కంఠాలకు చుట్టుకుంటోన్న
సమస్యల ఉరితాళ్ళ నుంచి
శాశ్వత విముక్తిని కాంక్షిస్తూ
సవ్యమైన మద్దతు ధరను ఆశిస్తూ
బిగించిన పిడికిళ్ళతో
శంభు సరిహద్దుల్లోకి
చొచ్చుకొస్తోంటే...
ముచ్చెమటలు పట్టిన రాజ్యం
ముళ్ళ కంచెలు నాటుతోంది!
టియర్ గ్యాస్‌తో విరుచుకుపడి
రబ్బరు బుల్లెట్లతో రంకెలేస్తోంది!
ఎక్కడి మొక్కలో సమ్మె చేస్తే
ఇక్కడ మనకేంటని పట్టీ పట్టనట్టు
ఉదాసీనంగా ఊరుకోకండి
ఎక్కడున్నా అవి మనం పీల్చే
ప్రాణ వాయువులే అని మరచిపోకండి
వాటికి చేయూతనివ్వటం మన ధర్మం!
సంఘీభావం తెలపటం మన కర్తవ్యం!
ఎందుకంటే...
ఆ మొక్కలే మాడిపోతే
రేపు మన కడుపులే సమ్మె చేస్తాయ్!
మన నోళ్ళే సమ్మె చేస్తాయ్!
మన ఆరోగ్యపు జీవక్రియలే సమ్మె
చేస్తాయ్!!

- పతివాడ నాస్తిక్,
సెల్ : 9441724167

రాజధాని అమరావతి పరిధిలో
రూ.24,276 కోట్ల పనులకు ఆమోదం

- రైతుల సమస్యకు త్వరలో పరిష్కారం
- 103 ఎకరాల్లో అసెంబ్లీ
- 42 ఎకరాల్లో హైకోర్టు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పరిధిలో రూ.24,276 కోట్ల పనులకు ఆమోదం తెలిపినట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. వీటిలో ట్రంక్ రోడ్లు, లేఅవుట్‌లు, ఐకానిక్ భవనాల నిర్మాణ పనులు ఉన్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సిఆర్‌డిఎ 43వ అథారిటీ సమావేశం సచివాలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పబ్లిసిటీ సెల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి నారాయణ వెల్లడించారు. తాజాగా ఆమోదం తెలిపిన పనులతో రాజధానిలో ఇప్పటి వరకూ మొత్తంగా రూ.45,249.24 కోట్ల పనులకు ఆమోదం లభించినట్లయ్యిందన్నారు. అసెంబ్లీ 103 ఎకరాల్లో, 250 మీటర్ల ఎత్తులో 11.22 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాలు లేని మిగతా రోజుల్లో ప్రజలకు ఈ భవనం పైనుంచి రాజధానిని తిలకించే సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. హైకోర్టు భవనాన్ని 42 ఎకరాల్లో రూ.1,408 కోట్ల వ్యయంతో 20.32 లక్షల చదరపు అడుగులు, 55 మీటర్ల ఎత్తులో 8 అంతస్తుల్లో నిర్మిస్తామన్నారు. జిఎడి (పరిపాలనా) భవనాన్ని 17.03 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 47 అంతస్తులతో నిర్మిస్తామని, దీంతోపాటు మొత్తం 5 టవర్లతో కూడిన వివిధ భవనాలు 68.88 లక్షల చదరపు అడుగుల్లో, రూ.4,688 కోట్లతో చేపట్టనున్నట్లు తెలిపారు. ఎల్పీఎస్ ప్లాట్లలో మౌలిక సదుపాయాల్లో భాగంగా 4 ప్రధాన రహదారులు, ఇతర సౌకర్యాలకు సంబంధించి 579.5 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధికి రూ.9,699 కోట్లు, ట్రంకు రోడ్ల నిర్మాణానికి రూ.7,794 కోట్లు, ఎస్‌టిపి పనులకు సంబంధించి రూ.318 కోట్లు మొత్తం కలిపి రూ.24,276 కోట్ల పనులకు ఈ సమావేశంలో ఆమోదం లభించిందని చెప్పారు. వచ్చే సోమవారం నాటికి టెండర్లు పిలవడం ప్రారంభమవుతుందని, ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని, ఇంకా ఏమైనా మిగిలి ఉంటే జనవరి నెలాఖరులోగా టెండర్లు పూర్తి చేస్తామని తెలిపారు. వచ్చే మూడేళ్లలో రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రపంచంలో మొదటి 5 ఉత్తమ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. వైసిపి నేతలు ప్రభుత్వంపై బురద జల్లే కార్యక్రమం చేపట్టారని, వారంతా ఒకసారి ఎస్వోఆర్ పరిశీలన చేయాలని కోరారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో అమరావతిలో విధ్వంసం ఏర్పడిందని, ప్రస్తుతం నిర్మాణ పనుల రేట్లు భారీగా పెరిగిపోయాయని చెప్పారు. అడ్మినిస్ట్రేషన్ టవర్లకు 41 శాతం, హైకోర్టుకు 28 శాతం అదనపు వ్యయం అవుతుందన్నారు. ల్యాండ్ పూలింగ్ చేపట్టిన 29 గ్రామాల్లో అన్ని రకాల చర్యలు చేపడతామని, రైతులకు న్యాయం చేస్తామని, వారి సమస్యలన్నీ పరిష్కరిస్తామని తెలిపారు.

జార్జియా రెస్టారెంట్‌లో 12 మంది భారతీయులు మృతి

గుడౌరి : జార్జియాలోని గుడౌరిలో ఒక రెస్టారెంట్‌లో 12 మంది భారతీయుల మృతదేహాలను కనుగొన్నారు. ఈ విషయాన్ని ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. మృతదేహాలపై లాంటి గాయాలు లేదా హింస జరిగిన ఆనవాళ్లు గుర్తించలేదని తెలిపింది. వీరంతా కార్బన్ మోనాక్సైడ్ పీల్చిన కారణంగా మరణించారని ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపింది. రెస్టారెంట్‌లోని రెండో అంతస్తులో ఉన్న బెడ్‌రూమ్‌ల్లో మృతదేహాలు ఉన్నాయని వెల్లడించింది. రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయిన తరువాత బెడ్‌రూమ్‌లకు సమీపంలో ఉన్న పవర్ జెనరేటర్‌ను ఆన్ చేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు తెలిపింది. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారని తెలిపింది. మృతి చెందిన 12 మంది భారతీయులేనని భారత రాయబార కార్యాలయం చెబుతుండగా, జార్జియా ప్రభుత్వం మాత్రం 11 మంది భారతీయులు, మరొకరు తమ దేశస్థుడని తెలిపింది. జార్జియాలోని గుడౌరి మంచు పర్వత క్రీడలకు ప్రసిద్ధి. వీటిని చూసేందుకు భారతీయులు ఎక్కువమంది అక్కడ పర్యటిస్తారు. అక్కడి రెస్టారెంట్లలోనూ భారతీయులు పని చేస్తుంటారు.

విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఆయా జిల్లాల్లో పండే పంటలకు అనుగుణంగా అవసరమైన విత్తనాలు, ఎరువులకు నివేదిక అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయంలో ఎపి సీడ్స్, మార్క్‌ఫెడ్, ఎపి వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌ల ఉన్నతాధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎపి సీడ్స్ ఆధ్వర్యాన రైతులకు నాణ్యమైన విత్తనాలు రాయితీపై అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో మెగా సీడ్ పార్క్ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా 16 ప్రదేశాల్లో 750 ఎకరాల్లో అందుబాటులో ఉన్న విత్తన ఉత్పత్తి క్షేత్రాలను నూరు శాతం సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. చిరు, తృణ ధాన్యాల సాగు, వినియోగం పెంచే విధంగా విత్తన దశ నుంచే రాయితీ అందించి, సాగును ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 35 శాతం రాయితీపై గోదాములు అద్దెకు ఇచ్చి గిట్టుబాటు ధర వచ్చిన అనంతరం పంటలు విక్రయించే వెసులుబాటు కల్పించాలని, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గోదాములు నూరు శాతం వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని, గోదాముల మరమ్మతులు, అవసరమైన సిబ్బంది నియామకానికి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో భాగంగా రైతులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ స్థాయిలో స్వయం సహాయక, రైతు ఉత్పత్తిదారులు, సహకార సంఘాలకు ఎరువుల అవసరం మేరకు సరఫరా చేసి రైతులకు ఎరువులు సమృద్ధిగా ఉంచాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్, కమిషనర్ ఢిల్లీరావు, మార్క్‌ఫెడ్ ఎమ్‌డి మంజీర్ జిలానీ సమాన్ పాల్గొన్నారు.

సరిహద్దు జిల్లాల్లో భారీగా అక్రమ మద్యం

- ప్రత్యేక ఫోకస్ పెట్టనున్న ఎక్సైజ్ శాఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సరిహద్దుల్లో ఉన్న జిల్లాల్లో పెద్దఎత్తున అక్రమ మద్యం లభిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. అక్కడ రేట్లు తక్కువగా ఉండటంతో అనేక మార్గాల ద్వారా రాష్ట్రంలోకి తీసుకువస్తున్నట్లు భావిస్తున్నారు. ఫలితంగా రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లుతోంది. దీనిని నివారించేందుకు ఎక్సైజ్ శాఖ ఆ జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇలా నాన్ పెయిడ్ డ్యూటీ లిక్కర్ వినియోగం, అక్రమ రవాణా కర్నూలు, చిత్తూరు, అనంతపురం, సత్యసాయి, నంద్యాల, అన్నమయ్య, కృష్ణా, కోనసీమ, ఎన్టీఆర్, కాకినాడ జిల్లాల్లో అధికంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిల్లో నంద్యాల, ఎన్టీఆర్ జిల్లాలు తెలంగాణకు సరిహద్దులుగా ఉండగా, చిత్తూరు జిల్లా తమిళనాడు సరిహద్దులో ఉంది. ఇక అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి జిల్లాలు కర్నాటక సరిహద్దుల్లోనూ, కర్నూలు కర్నాటక, తెలంగాణ ఉమ్మడి సరిహద్దులో ఉన్నాయి. కాకినాడ, కోనసీమ జిల్లాలు కేంద్ర పాలిత ప్రాంతమైన యానాంకు ఆనుకుని ఉన్నాయి.

ఒక్క కృష్ణా జిల్లా మాత్రమే ఏ రాష్ట్ర సరిహద్దులో లేకపోవడం గమనార్హం. కర్నాటకలో ఆంధ్రా కన్నా మద్యం ధరలు ఎక్కువగానే ఉన్నప్పటికీ దాని సరహద్దులో ఉన్న జిల్లాల్లో అక్రమ మద్యం లభిస్తుండటం అధికారుల్లో చర్చనీయాంశంగా ఉంది. గోవా నుండి ఈ జిల్లాల్లోకి మద్యం వస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ జిల్లాల్లోనే జనవరి నుంచి ఇప్పటివరకు ఏకంగా 1.90 లక్షల లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇక స్వాధీనం కాని మద్యం ఇంకెంత ఉంటుందోనని అంటున్నారు. అందుకే ఈ పది జిల్లాలపై మరింతగా దృష్టి సారించాలని ఎక్సైజ్ అధికారులు నిర్ణయించారు.

ఢిల్లీ ఎన్నికల్లో సిపిఎం పోటీ

రెండు స్థానాలకు అభ్యర్థుల ఎంపిక


అశోక్ అగర్వాల్


జగదీష్ చాంద్ శర్మ

ఇండియా న్యూస్ నెట్‌వర్క్-న్యూఢిల్లీ : రానున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో రెండు స్థానాలు (కరావాల్ నగర్, బాదర్‌పూర్) నుంచి సిపిఎం పోటీ చేయనుంది. ఈ మేరకు ఢిల్లీ సిపిఎం రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ రెండు స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేసింది. కరావాల్ నగర్ నుంచి సిపిఎం అభ్యర్థిగా ప్రముఖ న్యాయవాది, గుర్తింపు పొందిన సామాజిక కార్యకర్త అశోక్ అగర్వాల్ పోటీ చేయనున్నారు. అశోక్ అగర్వాల్ తాను వేసిన వివిధ పిటీషన్లు ద్వారా ప్రభుత్వ పాఠశాల ప్రవేశాల్లో అవకతవకలు, కనీస సౌకర్యాల లేమిని నివారించగలిగారు. అశోక్ అగర్వాల్ పిటీషన్ల కారణంగానే ప్రైవేట్ పాఠశాలల్లో 20 శాతం సీట్లు పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు లభించాయి. గుర్తించిన 47 ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇడబ్ల్యూఎస్ కేటగిరి కింద 10 శాతం ఇన్‌పేషంట్లను, 25 శాతం అవుట్ పేషంట్లకు చికిత్స అందిస్తున్నారు.

బాదర్‌పూర్ నుంచి జగదీష్ చాంద్ శర్మను సిపిఎం పోటీకి నిలిపింది. మీఠాపూర్‌కు చెందిన జగదీష్ ఈ ప్రాంతంలో జరిగిన అన్ని ప్రజా పోరాటాల్లోనూ ముందున్నారు. ఈ ప్రాంతంలో ఒక ప్రధాన భాగాన్ని 'ఓ' జోన్‌లో ఉంచడానికి ఢిల్లీ డెవలెప్‌మెంట్ అథారిటీ (డిడిఎ) నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇలాంటి నిర్ణయంతో నిర్మాణ పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని, మొత్తంగా ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమంగా ఏర్పాటు చేసిన జీన్స్ డైయింగ్ యూనిట్లు, ల్యాండ్ మాఫియాకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు నాయకత్వం వహించారు.

పోలవరంపై సిఎం చెప్పేవన్ని అబద్ధాలు : అంబటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టు విషయంలో సిఎం చంద్రబాబు నాయుడు చెప్పేవన్నీ అబద్ధాలేనని మాజీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. ఈ ప్రాజెక్టుపై చంద్రబాబుకు అవగాహన లేకపోవడం వల్లే నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 2019కి ముందే 72 శాతం పనులు జరిగాయని చెప్పడం అబద్ధమన్నారు. వైసిపి ప్రభుత్వ హయంలో లోయర్ కాఫర్ డ్యామ్, అప్పర్ కాఫర్ డ్యామ్ పనులు పూర్తి చేశామని గుర్తు చేశారు. తమ హయాంలో పనులు చేసి కేంద్రానికి బిల్లులు పంపితే ఎప్పుడో డబ్బులు వచ్చేవని, ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడం వల్ల పనులు చేయకుండానే కేంద్రం డబ్బులు ఇస్తుందని, ఈ డబ్బును ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. పోలవరాన్ని చంద్రబాబు ఎటిఎంలా వాడుతున్నారని ప్రధాని మోడీ చేసిన ఆరోపణలను గుర్తు చేశారు. చంద్రబాబు బిజెపితో పొత్తుపెట్టుకోగానే రూ.12,157 కోట్లు అడ్వాన్సుగా నిధులు కేటాయించారని తెలిపారు. ఇందులో తొలి విడతగా ఇచ్చిన రూ.2600 కోట్లను కూడా ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును ఎత్తు తగ్గించి డ్యామ్‌గా సిఎం చంద్రబాబు మార్చేస్తున్నారని విమర్శించారు.

గాయంపై ఉప్పు చల్లుతున్నారు

- కేంద్రం తీరుపై కేరళ ఆర్థికమంత్రి బాలగోపాల్ ఆగ్రహం

కొచ్చి : ఈ ఏడాది కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడటంతో భారీగా ప్రాణ, ఆస్తినష్టం సంభవించింది. ఆ సమయంలో భారత వైమానిక దళం (ఐఎఎఫ్) రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించినందుకు నిధులు చెల్లించాలని కేంద్రం డిమాండ్ చేయడంపై కేరళ ఆర్థికమంత్రి కె.ఎన్ బాలగోపాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వయనాడ్ విపత్తు వల్ల రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే... ఐఎఎఫ్ దళాలకు నిధులు చెల్లించాలని కేంద్రం డిమాండ్ చేయడం గాయాలపై ఉప్పు రుద్ది నట్టుగా ఉందని అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'విపత్తు సహాయం కింద కేరళ రాష్ట్రానికి నిధులు ఇస్తామని కేంద్రం వాగ్దానం చేసింది. ఆ నిధులను అందించడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైంది. వయనాడ్ ప్రకృతి విపత్తుకి ఆర్థిక సహాయాన్ని ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీతోపాటు పలువురు కాంగ్రెస్, సిపిఐ (ఎం) ఎంపీలు పార్లమెంటు వెలుపల ఇటీవల నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి, మాజీ కేంద్ర మంత్రులు వి మురళీధరన్, రాజీవ్ చంద్రశేఖర్ కేరళ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ప్రకృతి విపత్తులలో రెస్క్యూ ఆపరేషన్ బృందాలైన ఐఎఎఫ్ - ఎంసిసిలకు, వాటి ఖర్చుల రీయింబర్స్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లిస్తాయని, విజయన్ ప్రభుత్వం నిధులు ఎందుకు చెల్లించదంటూ ఎక్స్‌లో పోస్టులు పెట్టారు. దీనిపై కేరళ ఆర్థిక మంత్రి బాలగోపాల్ స్పందించారు. ఈ ఏడాది అక్టోబర్ 22న ఎయిర్‌లిఫ్ట్ ఛార్జీల చెల్లింపులు అంశం పరిష్కరించాలని కోరుతూ గవర్నర్ కార్యాలయానికి లేఖ రాశామని పేర్కొన్నారు.

ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ సమావేశాలను జయప్రదం చేయండి

- ఫెడరేషన్ అఖిల భారత కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రవాణా రంగం పరిరక్షణ, సంక్షేమ బోర్డు సాధన కోసం విజయవాడలో ఎంబివికెలో డిసెంబర్ 8, 9 తేదీల్లో జరిగే ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) వర్కింగ్ కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని ఫెడరేషన్ అఖిల భారత కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య కోరారు. సమావేశాలకు సంబంధించిన పోస్టర్‌ను విజయవాడలోని ఫెడరేషన్ కార్యాలయంలో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిఎన్ఎస్ 106 చట్టంలో డ్రైవర్లను హంతకుల కింద శిక్షలు విధించే సెక్షన్లను తొలగించాలని కోరారు. ట్రక్ గూడ్స్‌పై భారాలను తగ్గించాలని, రోడ్డు రవాణా కార్మికులందరికీ సామాజిక సంక్షేమ చట్టం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ శివాజి, ముజఫర్ అహ్మద్, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సుందరయ్య, అయ్యప్పరెడ్డి, సుబ్రమణ్యం, జిలానీ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ వర్కింగ్ కమిటీ సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



20 నుంచి ఎస్‌బిఐ మెగా ప్రాపర్టీ షో

- సొంతింటి కల నెరవేర్చుకోవచ్చు :ఎస్‌బిఐ సిజిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రభుత్వ రంగంలోని అతి పెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మెగా ప్రాపర్టీ షోను నిర్వహించనున్నట్లు తెలిపింది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. నగరంలోని హైటెక్స్‌లో డిసెంబర్ 20, 21, 22 తేదిల్లో ప్రాపర్టీ షోను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గృహ రుణాల్లో ఎస్‌బిఐ మార్కెట్ లీడర్‌గా ఉందన్నారు. హైదరాబాద్ సర్కిల్‌లో 2024 నవంబర్ 30 నాటికి ఎస్‌బిఐ రూ.66,249 కోట్ల గృహ రుణ పోర్టుపోలియో కలిగి ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ కాలంలో రూ.14,578 కోట్ల గృహ రుణాలు, రూ.5,732 కోట్ల టాప్‌అప్ రుణాలు జారీ చేశామన్నారు. మెగా ప్రాపర్టీ షోలో 50 పైగా పెద్ద బిల్డర్లు తమ ప్రాపర్టీలను ప్రదర్శన, విక్రయానికి అందుబాటులో ఉంటాయన్నారు. సొంతింటి కలను నెరవేర్చుకోవాలనుకునే వారికి మూడు రోజుల పాటు జరిగే ప్రాపర్టీ షో గొప్ప అవకాశమన్నారు.

'జై శ్రీరామ్' నినాదం నేరమా?

- మసీదు లోపల నినాదాలు చేసిన వారిని గుర్తించారా? : ప్రశ్నించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : జై శ్రీరామ్ అన్న నినాదం క్రిమినల్ నేరమెలా అవుతుందని సుప్రీం కోర్టు సోమవారం ప్రశ్నించింది. 'వారు ఒక మతానికి సంబంధించిన పదాలను లేదా పేర్లను గట్టిగా అరిచారు. అది నేరమెలా అవుతుంది?' అని జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన బెంచ్ ప్రశ్నించింది.మసీదు లోపల జై శ్రీరామ్ అని నినాదాలు చేశారని ఆరోపిస్తూ ఇద్దరు వ్యక్తులపై చేపట్టిన క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొట్టివేస్తూ సెప్టెంబరు 13న కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. దీనిని సవాలు చేస్తూ హైదర్ అలీ వేసిన పిటిషన్‌పై బెంచ్ విచారణ జరిపింది.'వారందరూ సిసిటివి నిఘాలో వున్నారని మీరు చెబుతున్నారు. లోపలకు వచ్చిన ఆ వ్యక్తులను ఎవరు గుర్తు పట్టారని' ప్రశ్నించింది.ఈ కేసులో దర్యాప్తు ఇంకా పూర్తి కాకుండానే హైకోర్టు కేసు కొట్టివేసిందని అలీ తరపున సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ తెలిపారు. మసీదులోకి ప్రవేశించిన వ్యక్తులను ఎలా గుర్తు పట్టారని బెంచ్ ప్రశ్నించగా రాష్ట్ర పోలీసులు దాన్ని వివరిస్తారని కామత్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా పిటిషన్ కాపీని అందజేయాలని బెంచ్ పిటిషనర్‌ను కోరింది. జనవరికి విచారణ వాయిదా వేసింది.

శివసేన (షిండే గ్రూపు)లో లుకలుకలు..

ముంబయి : మహారాష్ట్రలోని శివసేన (షిండే గ్రూపు)లో లుకలుకలు ప్రారంభమయ్యాయి. మంత్రి పదవి దక్కకపోవడంతో అసంతృప్తికి గురైన ఆ పార్టీ ఎమ్మెల్యే నరేంద్ర భోండేకర్ సోమవారం పార్టీ పదవికి రాజీనామా చేశారు. ప్రసుతం ఆయన శివసేన (షిండే గ్రూపు) డిప్యూటీ నేతగా వ్యవహరిస్తున్నారు. భండారా-పావని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయనకు మంత్రి పదవిని ఇస్తామని పార్టీ హామీ ఇచ్చింది. ఆదివారం కేబినెట్ విస్తరణలో ఆయనకు చోటు దక్కలేదు. దీంతో పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు నరేంద్ర భోండేకర్..ఏక్‌నాథ్ షిండే తదితరులకు సందేశాలు పంపినట్లు పేర్కొన్నాయి.

సోలార్ రంగంలో కోల్ ఇండియా పెట్టుబడులు

కోల్‌కత్తా : దేశంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారు కోల్ ఇండియా లిమిటెడ్ తాజాగా సోలార్ రంగంలో భారీ పెట్టుబడులను ప్రకటించింది. 661 మెగావాట్ల గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ పవర్ ప్రాజెక్టుల్లో రూ.1,209 కోట్ల పెట్టుబడులకు కోల్ ఇండియా ముందుకు వచ్చిందని కేంద్రం తెలిపింది. అదే విధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 211 మెగావాట్లు, 2026లో 697 మెగావాట్లు, 2027లో 1,235 మెగావాట్లు, 2028 ఆర్థిక సంవత్సరంలో 785 మెగావాట్లతో కలిపి మొత్తంగా 3 వేల మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొంది.

విద్యా రుణాల్లో 50 శాతం పెరుగుదల : ఆక్సీలో

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో ప్రతీ ఏడాది విద్యా రుణాల్లో 50 శాతం వృద్ధి నమోదవుతుందని ఆక్సీలో ఓవర్‌సీస్ లోన్స్ ప్రతినిధి శ్వేతా గురు తెలిపారు. ప్రముఖ ఎడ్యుకేషన్ ఫైనాన్స్ ఎన్‌బిఎఫ్‌సి అయిన ఆక్సిలో ఫిన్‌సర్వ్ గత 3 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్‌ల నుండి ఏడాదికేడాదితో భారీ పెరుగుదల చోటు చేసుకుంటుందన్నారు. ఈ నేపథ్యంలో తమ ప్రయత్నాలను మరింత వేగవంతం చేస్తున్నామన్నారు. తమ శాఖల నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ప్రతీ ఏడాది 65వేల మంది విద్యార్థులు విదేశాలకు వెళ్తున్నారన్నారు.

క్రౌన్ వెటర్నరీలో మార్స్ వెటర్నరీ పెట్టుబడులు

న్యూఢిల్లీ : క్రౌన్ వెటర్నరీ సర్వీసెస్‌లో పెట్టుబడి పెడుతున్న మార్స్ వెటర్నరీ హెల్త్ ప్రకటించింది. దీంతో భారత్‌లో పెంపుడు జంతువుల ఆరోగ్య సంరక్షణను అభివృద్ధి చేయడంలో ఈ పెట్టుబడి సహాయం చేయనుందని పేర్కొంది. స్థానిక పశువైద్య నిపుణులకు శిక్షణ, వనరులను అందించనున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ముంబయి, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, పూణేలోని ఐదు నగరాల్లో ఎనిమిది క్రౌన్ వెట్ క్లినిక్‌లను కలిగి ఉన్నట్లు తెలిపింది. ఈ ఒప్పందంలో తాము 60 మంది పశు వైద్యులతో సహా 240 మంది ఉద్యోగులకు అధునాతన శిక్షణా కార్యక్రమాలను అందించనున్నట్లు క్రౌన్ వెట్ వ్యవస్థాపకుడు ప్రతాప్‌సిన్హ్ గైక్వాడ్ పేర్కొన్నారు.

రాజ్యసభ ఎంపిల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రానికి చెందిన రాజ్యసభ ఎంపిలు ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభలో ఎంపిలు రాష్ట్రం నుంచి ఇటీవల ఎన్నికైన సానా సతీష్, బీదా మస్తాన్‌రావు, ఆర్ కృష్ణయ్యతో ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. టిడిపి తరపున సానా సతీష్, బీదా మస్తాన్‌రావు, బిజెపి తరపున ఆర్ కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందులో బీదా మస్తాన్‌రావు, ఆర్ కృష్ణయ్య రాజ్యసభ సభ్యులుగా రాజీనామా చేసి, టిడిపి, బిజెపిలో చేరారు.

నెలాఖరులో బీజింగ్‌లో అజిత్ దోవల్ పర్యటన

- సరిహద్దు అంశంపై చర్చలు

న్యూఢిల్లీ : మరో రెండు వారాల్లో జాతీయభద్రతా సలహాదారు అజిత్ దోవల్ బీజింగ్‌లో పర్యటించే అవకాశం వుంది. దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత విస్తృత సరిహద్దు అంశంపై జరిగే 23వ ప్రత్యేక ప్రతినిధుల (ఎస్‌ఆర్) చర్చలకు హాజరయ్యే భారత బృందానికి నాయకత్వం వహించనున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2019 డిసెంబరులో చివరిసారిగా ఈ చర్చలు న్యూఢిల్లీలో జరిగాయి. తూర్పు లడఖ్ సరిహద్దు వివాదాన్ని దృష్టిలో వుంచుకుని ఐదేళ్లపాటు ఈ చర్చలు జరగలేదు. అక్టోబరు 23న కజన్‌లో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జరిపిన సమావేశంలో తిరిగి ఈ చర్చల యంత్రాంగాన్ని పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు ఎస్‌ఆర్ చర్చలు జరగనున్నాయి. డిసెంబరు చివరిలో లేదా జనవరి ప్రారంభంలో ఈ చర్చలు జరుగుతాయని భావిస్తున్నారు. చర్చల వేదిక ఎక్కడ అనేది ఇంకా ఖరారు కాలేదు. అక్టోబరు 21న డెమ్‌చాక్, డెప్సాంగ్‌లపై ఇరు పక్షాల మధ్య ఒక అంగీకారం కుదిరిన నేపథ్యంలో అక్టోబరు 23న ఇరు దేశాల నేతలు సమావేశమై చర్చల యంత్రాంగాలను పునరుద్ధరించే నిర్ణయం తీసుకున్నారు.

కెనడా డిప్యూటీ ప్రధాని రాజీనామా

ట్రంప్ టారిఫ్‌లపై విభేదాలే కారణం

ఒట్టావా : కెనడా డిప్యూటీ ప్రధాని క్రిస్టియా ఫ్రీలాండ్ ఆకస్మికంగా తన పదవికి రాజీనామా చేశారు. ట్రంప్ టారిఫ్‌లపై ప్రధాని జస్టిన్ ట్రూడోతో తలెత్తిన విభేదాల నేపథ్యంలో సోమవారం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈనాడు మన దేశం తీవ్రమైన సవాలును ఎదుర్కొంటోందని ఆమె వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కెనడాకు అత్యుత్తమమైన మార్గమేది అనే విషయంలో మనిద్దరి మధ్య గత కొద్ది వారాలుగా విభేదాలు నెలకొన్నాయని ఆమె అందులో పేర్కొన్నారు. 2013లో తొలిసారిగా పార్లమెంట్‌కు ఎన్నికైన ఫ్రీలాండ్ రెండేళ్ల తర్వాత ట్రూడో కేబినెట్‌లో చేరారు. వాణిజ్య, ఆర్థిక, విదేశాంగ మంత్రిగా కీలకమైన పదవులు నిర్వహించారు. తనను వేరే పదవికి మార్చాలని ట్రూడో భావిస్తున్నారని, ఇటువంటి తరుణంలో తాను కేబినెట్ నుండి వైదొలగడమే మంచిదనే నిర్ణయానికి వచ్చినట్లు ఆమె ఆ పోస్టులో తెలిపారు. ట్రంప్ టారిఫ్‌ల బెదిరింపులను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరముందని ఆర్థిక మంత్రిగా ఆమె నొక్కి చెప్పారు. రాబోయే టారిఫ్ యుద్ధానికి మనం సన్నద్ధం కావాల్సి వుందన్నారు. కెనడా ప్రధాన వాణిజ్య భాగస్వామి అయిన అమెరికాకు 75శాతం ఎగుమతులు వెళతాయి.

2025 చివరిలో...

- బంగ్లాదేశ్ ఎన్నికలపై తాత్కాలిక నేత యూనస్ కీలక ప్రకటన

ఢాకా : బంగ్లాదేశ్ ఎన్నికలపై ఆ దేశ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ సోమవారం కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది చివరలో గాని, 2026 ప్రారంభంలో గాని సార్వత్రిక ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని చెప్పారు. జాతినుద్దేశించి సోమవారం ఆయన టెలివిజన్‌లో మాట్లాడుతూ 2025 చివరినాటికి లేదా 2026 ప్రథమార్థంలో ఎన్నికల తేదీలను నిర్ణయించవచ్చన్నారు. ఈ ఎన్నికల్లోగా పలు ఎన్నికల సంస్కరణలు చేపట్టాల్సి వుందని అన్నారు. ఎటువంటి లోపాలు, లొసుగులు లేని ఓటరు జాబితాలను రూపొందించడంతో సహ పలు సంస్కరణలతో ఈ ఎన్నికలను నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు అంగీకరిస్తే 2025 నవంబర్ నెలాఖరులోగా ఎన్నికలు నిర్వహించవచ్చని అన్నారు. ఎన్నికల సంస్కరణల కమిషన్ సిఫార్సు అదనపు సంస్కరణలు చేపట్లాంటే మరో ఆరు మాసాలు సమయం కావాల్సి వుంటుందన్నారు. 2026 మొదటి ఆరు మాసాల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు వుంటాయని స్పష్టం చేశారు.

రాజ్యాంగ హక్కులపై ఉద్దేశపూర్వక దాడి

- మహిళలకు ఓటు హక్కును ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకించింది
- సిపిఎం రాజ్యసభ ఎంపి బికాష్ రంజన్ భట్టాచార్య



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రాజ్యాంగ హక్కులపై ఉద్దేశపూరిత దాడి జరుగుతోందని సిపిఎం రాజ్యసభ నేత బికాష్ రంజన్ భట్టాచార్య విమర్శించారు. రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం రాజ్యసభలో జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. దేశ ప్రధాని ఆలయానికి శంకుస్థాపన చేసేందుకు వెళ్లి రాజ్యాంగ ప్రాథమిక విలువలపై దాడి చేశారని అన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రధాని ఎప్పుడూ వెళ్లి గుడికి శంకుస్థాపన చేయలేరని అన్నారు. 2014 నుంచి రాజ్యాంగ హక్కులపై ఉద్దేశపూర్వక దాడి జరుగుతోందని పేర్కొన్నారు. గతంలో 1975 ఎమర్జెన్సీ సమయంలో దాడి జరిగిందని, ఎమర్జెన్సీ విధించిన వ్యక్తే ఆ తరువాత తన తప్పును అంగీకరించారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఎమర్జెన్సీ విధించకుండానే దాడి చేస్తున్నారని, పైగా దాన్నే ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు కూడా న్యాయం లభించినప్పుడే రాజ్యాంగం సక్రమంగా అమలవుతుందని స్పష్టం చేశారు. 1970 నాటి జాతీయాకరణ ప్రక్రియ దేశ ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించడానికి ఒక ముఖ్యమైన అడుగు అని పేర్కొన్నారు.

దేశ రాజ్యాంగాన్ని ఎప్పుడూ వ్యతిరేకించే వాళ్లే ఆర్‌ఎస్‌ఎస్‌ను నిర్వహిస్తారని ఆయన విమర్శించారు. జాతీయ జెండాను, అశోకచక్రాన్ని వ్యతిరేకించిన వారు ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని గ్రూపు అని, స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారికి అండగా నిలిచారని అన్నారు. భారత రాజ్యాంగం ఆమోదం పొందితే, దానిని తగలబెట్టింది ఆర్‌ఎస్‌ఎస్ అని గుర్తు చేశారు. రాజ్యాంగంపై తన వ్యతిరేకతను ఆర్‌ఎస్‌ఎస్ బాహాటంగానే వ్యక్తం చేసిందన్నారు. భారత రాజ్యాంగం మనుస్మృతిపై ఆధారపడి లేదన్నది ఆర్‌ఎస్‌ఎస్ అభ్యంతరమని పేర్కొన్నారు. రాజ్యాంగంలో మహిళలకు ఓటు హక్కు కల్పించడాన్ని కూడా ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకించిందని గుర్తు చేశారు. గతంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నారని రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చల్లో స్పష్టమైందని తెలిపారు. ఈ చర్చలో రాజ్యసభ సభ్యులు కపిల్ సిబల్, మను అభిషేక్ సింఘ్వీ, రణదీప్ సూర్జేవాలా, హర్దీప్ సింగ్ పూరి, వైకో, విజయసాయిరెడ్డి తదితరులు మాట్లాడారు. లోక్‌సభలో నెహ్రూ ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణలను ప్రధాని విమర్శించారని అన్నారు. తొలి కేబినెట్‌లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, వల్లభాయ్ పటేల్, అంబేద్కర్ ఉన్నారనే విషయాన్ని మోడీ మర్చిపోయారని విమర్శించారు.

డ్రగ్స్‌తో అంధకారంలో యువత భవితవ్యం

- సుప్రీం కోర్టు ఆందోళన

న్యూఢిల్లీ : మాదకద్రవ్యాల వినియోగం వల్ల తీవ్రమైన సామాజిక ఆర్థిక, మానసిక దుష్ప్రభావాలు కలుగుతాయని, దీనివల్ల యువత భవితవ్యం మసకబారుతుందని సుప్రీంకోర్టు హెచ్చరించింది. దేశంలోని యువతలో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతుండడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సవాళ్లను ఎదుర్కొనలేక, ఒత్తిళ్లను తట్టుకోలేక కూల్‌గా వుండేందుకు దీన్ని వాడుతున్నారంటూ వ్యాఖ్యానించారు. సముద్ర మార్గాల ద్వారా పాకిస్తాన్ నుండి భారత్‌లోకి హెరాయిన్ అక్రమ రవాణా చేస్తున్న డ్రగ్ ట్రాఫికింగ్ నెట్‌వర్క్‌తో ప్రమేయముందంటూ నిందితుడు అంకుశ విపన్ కపూర్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) విచారణను సమర్ధిస్తూ జస్టిస్ నాగరత్న, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది. తల్లిదండ్రులు, సమాజం, ప్రభుత్వం ఇలా అన్ని వర్గాల నుండి కూడా సమిష్టి కృషి వుండాలని, అప్పుడే ఈ సామాజిక రుగ్మతను రూపుమాపగలమని కోర్టు పేర్కొంది. మాదకద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలంటూ జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా)కు మార్గదర్శకాలు జారీ చేసింది. విద్య, ఉద్యోగాల్లో అన్ని రకాలుగా ఒత్తిడి పెరిగిపోవడం, సాంస్కృతిక ప్రభావాలు వంటివన్నీ ఈ ప్రమాదకరమైన జీవన శైలికి కారణాలవుతున్నాయని పేర్కొంది. సవాళ్లను ఎదుర్కొనడానికి భయపడి ఇలా మాదకద్రవ్యాలను ఆశ్రయించి తప్పించుకుని తిరిగే విధానానికి యువత బానిసలవడం విచారకరమని పేర్కొంది.

నేడు జమిలీపై బిల్లు..!

- బిజెపి ఎంపీలకు విప్ జారీ

న్యూఢిల్లీ: పార్లమెంటు సమావేశాలు ముగిసేలోపు జమిలీపై బిల్లును ప్రవేశపెట్టాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఓవైపు ఇప్పుడు కాదని సంకేతాలిస్తూనే.. మరోవైపు మంగళవారం తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశిస్తూ లోక్‌సభలో తమ ఎంపీలందరికీ బిజెపి విప్ జారీ చేసింది. లోక్‌సభలో కీలక అంశాలపై చర్చ జరగనున్నందున గైర్హాజరు కావొద్దంటూ మూడు లైన్ల విప్‌ను జారీ చేస్తూ లోక్‌సభలో బిజెపి చీఫ్ విప్ డాక్టర్ సంజయ్ జైస్వాల్ ఓ లేఖను విడుదల చేశారు.

ఈ నేపథ్యంలోంచి చూస్తే.. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' బిల్లును పార్లమెంటు ముందుకు మంగళవారం తీసుకొచ్చే అవకాశం ఉంది. ఇందుకోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా మరో బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ లోక్‌సభలో మంగళవారం మధ్యాహ్నం ప్రవేశపెట్టనున్నట్టు తెలుస్తోంది. జమిలీ ఎన్నికల నిర్వహణపై అనేక అనుమానాలు నెలకొన్నవేళ దీనిపై విస్తృత సంప్రదింపుల కోసం బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపించాలని డిమాండ్ చేయాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి.

రైతుల ట్రాక్టర్ మార్చ్

కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

18న రైల్ రోకో

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్‌లను నెరవేర్చాలంటూ రైతులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. పంజాబ్-హర్యానా మధ్యనున్న శంభూ సరిహద్దులో రైతులు తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. రైతులు ఢిల్లీ లోపలికి ప్రవేశించకుండా భద్రతా బలగాలు అడ్డుకుంటుండటంతో.. వారు అక్కడే మకాం వేసి ఆందోళన చేస్తున్నారు. సోమవారం పంజాబ్ నుంచి రైతులు ర్యాలీగా ట్రాక్టర్‌లపై శంభూ బోర్డర్‌కు బయలుదేరారు. ఈ నేపథ్యంలో భద్రతా బలగాలు శంభూ సరిహద్దులో భద్రతను కట్టుదిట్టం చేశాయి. రైతులు ఢిల్లీ లోపలికి ప్రవేశించకుండా బారికేడ్లను మరింత పెంచారు. పంటకు కనీస మద్దతు ధర సహా పలు డిమాండ్‌ల పరిష్కారం కోసం ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు ఆందోళన చేస్తున్నారు. కానీ కేంద్ర సర్కారు మాత్రం వారి ఆందోళనను పట్టించుకోవడం లేదు. పైగా పోలీసులతో వారిపై దాడి చేయిస్తోంది. కేంద్రం తీరుకు నిరసనగా ఈ నెల 18న పంజాబ్‌లో రైల్‌రోకో నిర్వహించనున్నట్లు రైతులు ఇప్పటికే హెచ్చరించారు. హర్యానాలో నిరసనలు తెలుపుతున్న రైతు సంఘాల ఆధ్వర్యాన రైతులు సోమవారం అంబాలాలో ట్రాక్టర్ మార్చ్ నిర్వహించారు. ఖనౌరి, శంభు సరిహద్దులు వద్ద రైతులు క్రమశిక్షణ, పట్టుదలతో ఆందోళన చేస్తున్నారు. తమపై దాడి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలపై ధ్వజమెత్తారు. రైతులు తమ ట్రాక్టర్లపై జాతీయ త్రివర్ణ పతాకాలను, తమ సంఘాల జెండాలతో కట్టి ముందుకు సాగారు. అంబాలా రోడ్లకు ఒకవైపున ప్రజలు రాకపోకలు సాగించడంతో రెండు మార్గాల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉంది.



రైతుల ట్రాక్టర్ మార్చ్

పంజాబ్‌కు మద్దతుగా హర్యానాలో రైతులు ట్రాక్టర్ మార్చ్

ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి శంభు, ఖానౌరీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న పంజాబ్ రైతులకు సంఘీభావం తెలుపుతూ కైతాల్, హిసార్, పానిపట్ సహా పలు జిల్లాల్లో రైతులు ట్రాక్టర్ మార్చ్‌లు చేపట్టారు. వివిధ గ్రామాల రైతులు కలయత్ పట్టణంలోని కిసాన్ చౌక్ వద్దకు చేరుకున్నారు. సోమవారం ఉదయం కైతాల్‌లో ఎస్‌డిఎం కార్యాలయం వరకు మార్చ్ నిర్వహించారు. మార్చ్ అనంతరం, గత 11 నెలలుగా రెండు సరిహద్దుల్లో కొనసాగుతున్న నిరసనపై ప్రధాని మోడీ జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అంబాలాలో రైతులు కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఎంఎస్‌పికి చట్టపరమైన హామీతో సహా 13 డిమాండ్లను లేవనెత్తుతూ దల్లేవాల్ స్వయంగా ప్రధానికి బహిరంగ లేఖ రాశారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు ధ్వజమెత్తారు.

విషమించిన దల్లేవాల్ ఆరోగ్యం

చండీగఢ్ : డిమాండ్ల సాధన కోసం 21 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకులు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్యం మరింతగా క్షీణించింది. తక్షణమే ఆసుపత్రిలో చేరాలని వైద్యులు సూచించారు. దల్లేవాల్ మాత్రం వైద్య చికిత్సకు నిరాకరిస్తున్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి), రైతు రుణాల మాఫీ, రైతులు, వ్యవసాయ కార్మికులకు పెన్షన్ వంటి 13 డిమాండ్లతో పంజాబ్-హర్యానా సరిహద్దు ఖనౌరీ వద్ద క్యాన్సర్‌తో బాధపడుతున్న 70 ఏళ్ల దల్లేవాల్ నవంబర్ 26 నుంచి నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం నాటికి ఈ దీక్ష 21వ రోజుకు చేరుకుంది. దల్లేవాల్‌ను పరీక్షించిన డాక్టర్ అవతార్ సింగ్ మాట్లాడుతూ 'ప్రస్తుత పరీక్షల ప్రకారం దల్లేవాల్ క్రియేటినిన్ స్థాయి పెరుగుతోంది. గ్లోమెరులర్ ఫిల్ట్రేషన్ రేట్ (జిఎఫ్ఆర్) దిగజారింది. ఒక పక్క కీటోన్లు కూడా చాలా ఎక్కువగా ఉన్నాయి. ఇటువంటి పరిస్థితి చాలా తీవ్రమైనది' అని చెప్పారు. దల్లేవాల్ ఎటువంటి ఆహారం తీసుకోవడం లేదని, కేవలం నీళ్లు మాత్రమే తాగుతున్నారని డాక్టర్ తెలిపారు. దల్లేవాల్ చాలా బలహీనంగా ఉన్నారని, తనంతట తానుగా నిలబడలేకపోతున్నారని, బిపి కూడా చాలా తక్కువగా ఉందని చెప్పారు. దల్లేవాల్ వైద్య చికిత్సకు నిరాకరిస్తున్నారని రైతు నాయకులు అభిమన్యు కోహార్ తెలిపారు. ప్రభుత్వాల తప్పుడు విధానాల కారణంగా ఆత్మహత్య చేసుకున్న ఏడు లక్షల మంది రైతుల జీవితాల కంటే తన ప్రాణం ముఖ్యం కాదని దల్లేవాల్ చెప్పారని అన్నారు. రైతుల డిమాండ్లను ఆమోదిస్తేనే నిరాహార దీక్ష విరమిస్తారని, లేకపోతే ప్రాణత్యాగానికైనా దల్లేవాల్ మానసికంగా సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

మూగబోయిన తబలా!

- సంగీత ప్రపంచానికి ఎనలేని లోటు
- జాకీర్ హుస్సేన్‌కు ప్రముఖుల నివాళి



న్యూఢిల్లీ : శాన్‌ఫ్రాన్సిస్కోలో సోమవారం కన్నుమూసిన ప్రపంచ ప్రఖ్యాత తబలా విద్వాంసుడు, భారతీయ శాస్త్రీయ సంగీత ప్రముఖుల్లో ఒకరైన ఉస్తాద్ జాకీర్ హుస్సేన్‌కు దేశవ్యాప్తంగా ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. 'తబలా మూగపోయింది' అంటూ సంతాపం వ్యక్తం చేశారు. సామాన్యమైన సంగీత పరికరాన్ని సార్వజనీన శాంతికి, మానవత్వానికి బలమైన వాణిగా మార్చివేసిన మహనీయుడని కొనియాడారు. హుస్సేన్ అసాధారణ ప్రతిభా పాటవాలు, ఆయన నిబద్ధత, సృజనాత్మకత హద్దులనేవి లేకుండా ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులను రంజింప చేశాయి. ఊపిరితిత్తుల సమస్య (ఐపిఎఫ్)తో ఐసియులో చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబసభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వార్త తెలిసిన వెంటనే ప్రధాని మోడీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా పలువురు రాజకీయ, సినీ, సంగీత రంగాలకు చెందిన ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. ఆ తబలా ఇక మళ్లీ మోగదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

సాంస్కృతిక ఐక్యతకు చిహ్నం : ప్రధాని మోడీ ప్రశంసలు

జాకీర్ హుస్సేన్ నిజమైన మేధావి, సాంస్కృతిక ఐక్యతకు చిహ్నమని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ఆయన మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటని పేర్కొన్నారు. భారతీయ శాస్త్రీయ సంగీత ప్రపంచంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన నిజమైన మేధావి అని కొనియాడారు. జాకీర్ హుస్సేన్ కుటుంబ సభ్యులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు సానుభూతి ప్రకటిస్తున్నట్లు ఎక్స్‌లో ప్రధాని పేర్కొన్నారు.

సంగీత ప్రపంచానికి తీరని లోటు : రాహుల్ గాంధీ

జాకీర్ హుస్సేన్ మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తన కళతో ఘనమైన వారసత్వాన్ని ఆయన మనకు వదిలివెళ్లారని పేర్కొన్నారు. మనందరి స్మృతుల్లో ఆయన ఎప్పటికీ జీవించే వుంటారని పేర్కొన్నారు.

సంస్కృతి, మానవత్వానికి ఎనలేని లోటు : పినరయి విజయన్

ప్రపంచవ్యాప్తంగా భారతీయ సంగీతానికి ఆదరణ కల్పించిన ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ దేశ ఘనమైన సంగీత వారసత్వానికి ప్రతీక అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాళులర్పించారు. కళా రంగానికి ఆయన చేసిన సేవలు అనిర్వచనీయమన్నారు. ఆయన మృతితో సంస్కృతీ, మానవత్వానికి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులతో పాటూ సంగీతాభిమానులకు కూడా సానుభూతిని తెలియజేశారు.

పలువురు ప్రముఖుల నివాళి

జాకీర్ హుస్సేన్ సంగీతానికి సరిహద్దుల్లేవని ప్రముఖ క్రికెటర సచిన్ టెండూల్కర్ వ్యాఖ్యానించారు. ప్రజల హృదయాల్లో ఆయనకు చిరస్మరణీయమైన స్థానం వుందని కొనియాడారు. కమల్ హాసన్, అక్షయ్ కుమార్, కరీనా కపూర్, శంకర్ మహదేవన్, మాండలిన్ రాజేష్ సహా పలువురు సినీ ప్రముఖులు ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. తన కళతో ఆయన మనకందించిన ఆనందానికి మనం ఎప్పటికీ కృతజ్ఞతతో వుండాలని కమల్ హాసన్ వ్యాఖ్యానించారు.



లోకేష్‌కు 'బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశం' పుస్తకం అందిస్తున్న ఎమ్మెల్సీలు

లోకేష్‌ను కలిసిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, బి గోపిమూర్తి కలిశారు. ఉండవల్లిలోని లోకేష్ నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పశ్చిమ-తూర్పు గోదావరి ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ ఉప ఎన్నికల్లో గెలుపొందిన గోపిమూర్తిని లోకేష్ అభినందించారు. లక్ష్మణరావు రచించిన 'బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశం' పుస్తకాన్ని అందించారు. పాఠశాల విద్యలో తీసుకొస్తున్న సంస్కరణల గురించి లోకేష్ వారికి ఈ సందర్భంగా వివరించారు.

'మెజారిటీ' వ్యాఖ్యపై చర్య

- వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వండి
- అలహాబాద్ జడ్జికి సుప్రీం కొలీజియం సమన్లు

న్యూఢిల్లీ : వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ అలహాబాద్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌కు సుప్రీంకోర్టు కొలీజియం సమన్లు జారీ చేసింది. ఈ నెల ప్రారంభంలో జరిగిన ఓ కార్యక్రమంలో శేఖర్ కుమార్ యాదవ్ ప్రసంగిస్తూ 'మెజారిటీ అభీష్టం' మేరకే దేశం పని చేస్తుందని వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు కొలీజియం ఆయనకు సమన్లు జారీ చేస్తూ వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం మంగళవారం సమావేశమై ఈ అంశంపై చర్చిస్తుందని తెలిసింది.

ఈ నెల 8న ప్రయాగరాజ్‌లో విహెచ్‌పి కార్యక్రమంలో జస్టిస్ యాదవ్ ప్రసంగిస్తూ ఉమ్మడి పౌరస్మృతిని సమర్ధించారు. 'ఇది చట్టం. ఈ చట్టం మెజారిటీకి అనుగుణంగా పనిచేస్తుంది. కుటుంబం లేదా సమాజం కోణంలో దీనిని చూడండి. మెజారిటీ ప్రజల సంక్షేమానికి, సంతోషానికి ఏది ప్రయోజనకరమో దానినే అంగీకరించడం జరుగుతుంది' అని ఆయన చెప్పారు. జస్టిస్ యాదవ్ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడంతో పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగాయి. న్యాయమూర్తి వ్యాఖ్యలు విభజనకు దారితీస్తాయని, అవి రాజ్యాంగ విరుద్ధమైనవని ప్రతిపక్షాలు మండిపడ్డాయి.

యాదవ్ వ్యాఖ్యలపై మీడియాలో వచ్చిన వార్తలకు సుప్రీంకోర్టు స్పందిస్తూ అలహాబాద్ హైకోర్ట్ నుండి నివేదికను కోరింది. 'జస్టిస్ యాదవ్ ప్రసంగానికి సంబంధించి పత్రికలలో వచ్చిన వార్తలను సుప్రీంకోర్టు గమనంలోకి తీసుకుంది. దీనిపై హైకోర్టు నుండి వివరాలు కోరాము. ఈ అంశాన్ని పరిశీలిస్తున్నాము' అని సుప్రీంకోర్టు ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. జస్టిస్ యాదవ్ వ్యాఖ్యలు రాజకీయ, న్యాయ వర్గాలలో కలకలం రేపాయి. అవి న్యాయ వ్యవస్థ నిష్పాక్షికతను ఉల్లంఘిస్తున్నాయని విమర్శకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయమూర్తిగా చేసిన ప్రమాణాన్ని యాదవ్ వ్యాఖ్యలు ఉల్లంఘిస్తున్నాయని పేర్కొంటూ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, సిపిఐ (ఎం) నేత బృందాకరత్ ప్రధాన న్యాయమూర్తి ఖన్నాకు లేఖ రాశారు. జడ్జి వ్యాఖ్యలను ఖండిస్తూ బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కూడా ఓ తీర్మానాన్ని ఆమోదించింది. జస్టిస్ యాదవ్ అభిశంసన కోసం రాజ్యసభలో 55 మంది ప్రతిపక్ష సభ్యులు నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే.

భారత్, శ్రీలంక ఆర్థిక భాగస్వామ్యం విస్తరణ

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించినట్లు ప్రధాని మోడీ తెలిపారు. భౌతిక, డిజిటల్, ఇంధన సంబంధాలనేవి సహకారానికి మూల స్తంభాలని ఆయన స్పష్టం చేశారు. విద్యుత్ గ్రిడ్ అనుసంధానతకు, పెట్రోలియం పైప్‌లైన్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. రామేశ్వరం, తలైమన్నార్‌ల మధ్య ఫెర్రీ సర్వీసులను ప్రారంభిస్తామని ప్రకటించారు. మత్స్యకారుల అంశం కూడా వారి మధ్య చర్చకు వచ్చింది. వారి జీవనోపాధికి సంబంధించిన అంశంపై మానవతా దృక్పథంతో ముందుకు సాగుతామన్నారు. తమిళుల ఆకాంక్షలను శ్రీలంక ప్రభుత్వం నెరవేరుస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. భూ జల అధ్యయనంపై ఇరు దేశాలు పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. ప్రాంతీయ శాంతి, భద్రత, అభివృద్ధికి కొలంబో సెక్యూరిటీ కాన్‌క్లేవ్‌ను ఒక ముఖ్యమైన వేదికగా ఇరుదేశాలు భావిస్తున్నాయని శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకెతో కలిసి చేసిన సంయుక్త ప్రకటనలో మోడీ పేర్కొన్నారు. ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలు మన నాగరికతతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. భారత్‌లో పాలీ భాషకు ప్రాచీన భాష హోదా ఇచ్చినప్పుడు శ్రీలంకలో కూడా వేడుకలు జరుపుకున్నారని పేర్కొన్నారు.

సిరియాపై ట్రంప్‌తో నెతన్యాహు చర్చలు

- సిరియాతో బ్రిటన్ దౌత్య సంబంధాలు
- 50మిలియన్ల పౌండ్ల ఆర్థిక సాయం
- గోలన్ హైట్స్ విస్తరణకు ప్రయత్నాలు



జెరూసలేం, గాజా : సిరియాలోని పరిణామాలపై, గాజాలో హమాస్ చెరలోని బందీల విడుదలపై ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన ట్రంప్‌తో ఆదివారం చర్చించారు. శనివారం రాత్రి కూడా ట్రంప్‌తో మాట్లాడినట్లు నెతన్యాహు తెలిపారు. సిరియాతో ఘర్షణ పడాలని తాము అనుకోవడం లేదని నెతన్యాహు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిరియా నుండి ఎదురయ్యే ముప్పును భగ్నం చేయడానికే తాము చర్యలు తీసుకుంటున్నామని చెప్పుకున్నారు.

మరోపక్క సిరియాలోని రెబెల్ గ్రూపు హయత్ తహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) గ్రూపుతో దౌత్య సంబంధాలు నెలకొల్పినట్లు బ్రిటన్ విదేశాంగ మంత్రి ప్రకటించారు. హెచ్‌టిఎస్‌తో సంబంధాలు పెట్టుకున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి కూడా శనివారం ప్రకటించారు. అలాగే సిరియన్లకు 63 మిలియన్ల డాలర్ల (50మిలియన్ల పౌండ్లు) సాయాన్ని అందచేస్తున్నట్లు బ్రిటన్ ప్రకటించింది. దశాబ్ద కాలంగా సిరియాలో సాగిన అంతర్యుద్ధానికి ప్రజలు తీవ్రంగా బలయ్యారు. దేశ మౌలిక సదుపాయాల వ్యవస్థ కకావికలమైంది. పెద్ద సంఖ్యలో ప్రజలు నిర్వాసితులయ్యారు. చాలామంది దేశం విడిచి వెళ్ళిపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో సిరియన్లకు ఎంతగానో అవసరమైన మానవతా సాయం కింద ఈ మొత్తాన్ని అందచేస్తున్నట్లు బ్రిటన్ ప్రకటించింది. ప్రజల ఆహారం, వసతి, అత్యవసర ఆరోగ్య సంరక్షణతో సహా 10లక్షల మందికి పైగా ప్రజలకు తక్షణ సాయంగా 30మిలియన్ల పౌండ్లు అందుతుందని తెలిపింది. మరో 10మిలియన్ల పౌండ్లు పొరుగుదేశాల్లోని సిరియన్లకు సాయంగా లెబనాన్‌లోని ప్రపంచ ఆహార కార్యక్రమానికి అందచేయనున్నారు. మరో 10మిలియన్ల పౌండ్లు జోర్డాన్‌కు అందనుంది. గోలన్ హైట్స్ సరిహద్దులను విస్తరించాలని ఇజ్రాయిల్ భావిస్తోందని టర్కీ విమర్శించింది. ఇందుకోసం ఆదివారం ఒక ప్రణాళికను ఆమోదించారని, దాని ప్రకారం గోలన్ హైట్స్ నగరాల్లోని జనాభాను రెట్టింపు చేయాలని భావిస్తున్నారని పేర్కొంది. అదే గనుక జరిగితే బషర్ ప్రభుత్వ కూల్చివేత తర్వాత సిరియాలో సుస్థిరత నెలకొనడానికి తీసుకునే చర్యలకు ఎదురు దెబ్బ తగులుతుందని విమర్శించింది.

గత 24 గంటల్లో 69 మంది మృతి

గాజాపై ఇజ్రాయిల్ సైన్యం ఏడాదికిపైగా దాడులు కొనసాగిస్తోంది. ఈ దాడుల్లో ఇప్పటికి 45వేల మందికి పైగా పాలస్తీనియన్లు మృతి చెందిన సంగతి తెలిసిందే. తాజాగా గత 24గంటల్లో 69 మంది మృతి చెందారని వైద్య వర్గాలు పేర్కొన్నాయి. గాజా స్ట్రిప్‌లో పాఠశాలల్లో తల దాచుకుంటున్న పాలస్తీనియన్లను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ సైన్యం నాలుగుసార్లు దాడులకు పాల్పడింది. ఇజ్రాయిల్ సైన్యం పాల్పడుతున్న ఈ క్రూరమైన దాడుల్ని ఇరాన్ విదేశీ మంత్రిత్వశాఖ తీవ్రంగా ఖండించింది. దాడుల్ని ఆపాలంటూ ఐక్యరాజ్యసమితి ఎన్నిసార్లు హెచ్చరికలు జారీ చేస్తున్నా వాటిని బేఖాతరు చేస్తూ ముందుకు సాగడం, పైగా గాజాలో మారణహోమానికి అమెరికా మద్దతు ఇవ్వడం సిగ్గులేని చర్య అని ఇరాన్ అధికార ప్రతినిధి ఎస్మాయిల్ బఘాయి విమర్శించారు.

మరో రైల్వే ప్రాజెక్టు పూర్తి : ఎంఐసి వెల్లడి

హైదరాబాద్ : ఎల్‌ఇడి వీడియో డిస్‌ప్లేలు, ఎలక్ట్రానిక్ సొల్యూషన్‌ల గ్లోబల్ లీడర్‌గా ఉన్న ఎంఐసి ఎలక్ట్రానిక్స్‌కు పశ్చిమ రైల్వే జోన్‌లోని రత్లాం డివిజన్‌లో తన ప్రాజెక్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించింది. ఈ మేరకు కంపెనీ లెటర్ ఆఫ్ కంప్లీషన్. ఇన్‌స్టలేషన్ సర్టిఫికేట్‌ను అందుకున్నట్లు పేర్కొంది. ఇది భారతీయ రైల్వేలతో భాగస్వామ్యంలో తమ మరో ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని ఎంఐసి సిఇఒ రక్షిత్ మాథూర్ తెలిపారు. ఐదులైన్ రైల్ డిస్‌ప్లే, ప్లాట్‌ఫారంల్లో కోచ్ గైడెన్స్ డిస్‌ప్లే, గడియారాలు, సమాచార ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేశామన్నారు.

కొండవీటి చేంతాడు



'అమ్మా! ముని మామ్మ ఎక్కడికి వెళ్లారు?' అని రుద్రాంశ్ ఆరాగా ప్రశ్నించాడు. 'గుడికి వెళ్లారు' చెప్పింది సౌమ్య. 'నన్నెందుకు తీసుకు వెళ్ళలేదు?' అన్నాడు ఈసారి కాస్త గోముగా. 'నువ్వు నిద్ర పోతున్నావు, లేపినా లేవలేదు. అందుకే మామ్మ గారు నిన్ను తీసుకువెళ్ళకుండా గుడికి వెళ్లి పోయారు' అంది అమ్మ. 'అయితే నువ్వు నాకు కథ చెప్పు' అని మారాం చేసాడు రుద్రాంశ్.

'నాకు చాలా పని ఉంది. కథలు మామ్మగారు చెప్తారు. నేను ఒక ఆట చెప్తాను ఆడుతావా?' అడిగింది సౌమ్య. 'ఆట.. భలే భలే. చెప్పు చెప్పు' అన్నాడు రుద్రాంశ్. సౌమ్య వివరించి చెప్పింది. రుద్రాంశ్‌కి భలే నచ్చేసింది ఆ ఆట. వెంటనే సుద్దముక్క పట్టుకుని మొదలుపెట్టేసాడు.

'ఆర్ ఎ టీ రేట్... టి ఎ పి ట్యాప్...' అనుకుంటూ చివరి అక్షరంతో పదాన్ని రాస్తూ అంత్యాక్షరి ఆటలో మునిగిపోయాడు రుద్రాంశ్. ఒకదాని పక్కన ఒకటి పదాలు రాసుకుంటూ వీధి వాకిట్లోంచి గుమ్మం వరకు వెళ్ళాడు. ఇంతలో గుడి నుంచి వచ్చిన మునిమామ్మ గారు రుద్రాంశ్‌ని చూసి 'ఏంటో ఈ వింత, అబ్బాయి గారు కొండవీటి చేంతాడులా రాసుకుంటూ పోతున్నారు' అనుకుంటూ లోనికి వెళ్ళింది. 'అది తాడు కాదు అమ్మమ్మ గారూ, అంత్యాక్షరి ఆట. నేనే వాడికి నేర్పాను' అంది సౌమ్య.


మనవరాలి అమాయకత్వానికి లోలోన నవ్వుకున్న మునిమామ్మ 'నీ తెలివి తెల్లారినట్లే ఉంది. చాలా పొడవుగా ఉండేవాటిని కొండవీటి చేంతాడుతో పోలుస్తారు. అది తాడు కాదని నాకు తెలియదా! ఇది ఒక జాతీయం.

పల్నాటి ప్రాంతానికి చెందిన కొండవీటి కోట గుంటూరుకు 26 కి.మీ. దూరంలో ఉంది. పూర్వం అక్కడ నీటి కొరత ఎక్కువగా ఉండేది. కోట వద్ద బావులు చాలా లోతుగా ఉండేవి. ఆ బావుల్లో నీటిని తోడటం కోసం చేదలకి పొడవైన తాళ్ళు కట్టేవారు. చేదకి కట్టిన తాడు కాబట్టి చేంతాడు అయ్యింది. ఏదైనా పొడవాటి వస్తువుని, విషయం సాగదీసి చెప్పినప్పుడు, ఎక్కడైనా పెద్ద లైను ఉందని ఉదహరించేటప్పుడు 'కొండవీటి చేంతాడు'తో పోలుస్తారు. ఈ విధంగా ఈ జాతీయం జనబాహుళ్యంలోకి వచ్చింది' అని వివరించి చెప్పింది మునిమామ్మ.

'ఓహో దీని వెనుక కథ ఇదన్నమాట' అంది సౌమ్య. ఈలోపు 'అమ్మా నేనింక రాయలేను చేతులు నొప్పి' అంటూ అమ్మ చెంతకు చేరాడు రుద్రాంశ్.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

నేను గీసిన బొమ్మ





పి.శరణ్,
8వ తరగతి,
జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల,
నర్సింహులపల్లి,
పెద్దపల్లి జిల్లా.

తేడాలు గుర్తించండి



పిల్లలూ! ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో ఆరు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అవమానాలే పెట్టుబడిగా..


కలలు కనడం చాలా సులభం. వాటిని నెరవేర్చుకోవడమే కష్టం. కానీ ఎంతోమంది తమ కలలని సాకారం చేసుకుంటారు. ప్రగతిబాటలో నడుస్తారు. అలాంటి వారిలో ఒకరే కేరళకి చెందిన మహ్మద్ యాసిన్. 29 ఏళ్ల ఈ యువకుడు ఇటీవల కేరళ జ్యుడిషియల్ సర్వీస్ ఎగ్జామ్‌లో రెండో ర్యాంకు సాధించాడు. మెజిస్ట్రేట్‌గా నియమితుడయ్యారు. ఈ లక్ష్యం సాధించడం వెనుక ఆయన ఎన్నో అవరోధాలు అధిగమించారు. అవమానాలు భరించారు. అతని గురించి చెప్పుకోవాలంటే 'విలయూర్ పేపర్ బాయ్'గా అతని జీవితం మొదలైన దగ్గర నుండి తెలుసుకోవాలి.

యాసిన్ తండ్రి యాసిన్‌కి మూడేళ్లప్పుడు కుటుంబం నుండి దూరంగా వెళ్లిపోయాడు. తమ్ముడిని, తనని ఆశా వర్కర్ అయిన తల్లే పెంచి, పోషించింది. ఒంటరి తల్లి పెంపకంలో సమాజం అతన్ని చిన్నచూపు చూసింది. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాడు. తల్లి కష్టం చూడలేని యాసిన్ కుటుంబం కోసం ఏడేళ్ల నుండే పనులకు వెళ్లేవాడు. సౌకర్యాలు పొందడం, లగ్జరీగా ఉండడం చిన్నారి యాసిన్‌కి అస్సలు తెలియదు. పేపర్ బాయ్‌గా, పాలబ్బాయిగా, నిర్మాణరంగ కూలీగా, పెయింటర్‌గా, ఫుడ్ డెలివరీ బాయ్‌గా ఏ పని ఉంటే ఆపనికి వెళ్లడం అతని దినచర్యగా ఉండేది.

'అమ్మ మమ్మల్ని చాలా కష్టాలు పడి పెంచింది. కానీ అందరూ మమ్మల్ని చులకనగా చూసేవారు. సరిగ్గా పెరగడం లేదని అవమానించేవారు. మా ప్రతి కదలికను ఎగతాళి చేసేవారు. అవమానాలే నా పెట్టుబడి. పేదరికం కారణంగా స్కూల్లో కూడా అవమానాలు ఎదుర్కొన్నాను. సరిగ్గా చదవడం లేదని చాలాసార్లు తరగతి గది నుండి బయటికి పంపేశారు. నా వ్యక్తిగత పరిస్థితులు నా చుట్టూ ఎన్నో విషమపరిస్థితులను తీసుకొచ్చాయి' అంటారు యాసిన్.

ప్రతి కూలతలనే సానుకూలతలుగా మలచుకుని యాసిన్ విద్యాభ్యాసం పూర్తిచేశారు. 2019లో ఎర్నాకులం లా కాలేజీలో డిగ్రీలో చేరారు. ఇక్కడ కూడా యాసిన్‌ని అతని పేదరికం వెంటాడింది. కాలేజీ ఫీజుల కోసం ఫుడ్ డెలివరీ బాయ్‌గా మారారు. పగలు కాలేజీకి వెళ్లడం, రాత్రుళ్లు కొచీలో డెలిరీ బాయ్‌గా విధులు నిర్వహించే వారు.

మొదట్లో సాధారణ విద్యార్థిగా ఉన్న యాసిన్ నెమ్మదిగా చదువుపై దృష్టిపెట్టారు. లా మొదటి సంవత్సరం కంటే రెండో ఏడాది నుండి మెరుగైన ప్రతిభతో రాణించారు. యూనివర్శిటీ టాపర్లలో ఒకరిగా నిలిచారు.



ఎల్ఎల్‌బి పూర్తిచేసిన తరువాత 2023 నుండి లాయర్‌గా అద్భుత ప్రదర్శన కనబరిచారు. 'అవుట్ స్టాండింగ్ లాయర్' అవార్డు అందుకునేంతగా ఆయన పనితీరు ఉండేది.

'నా ఉన్నత చదువంతా సెకండ్ హ్యాండ్ బుక్స్‌తోనే సాగింది. ఇతరులు వాడేసిన బట్టలనే కట్టుకునేవాడిని. మసీదు వాళ్ల దానం చేసిన బియ్యం, పప్పులతోనే మా రోజు గడిచేది. ఇలాంటి పరిస్థితుల్లో నాకు సాయంగా నిలబడిన ప్రతి ఒక్కరికీ నేను రుణపడి ఉంటాను. నా సీనియర్ అడ్వకేట్ సాహుల్ హమీద్ ఇచ్చిన ప్రోత్సాహం ఎప్పటికీ మర్చిపోను. ఆయన తన ఆఫీసులో నాకు చోటిచ్చారు. ఆ వెసులుబాటు నాకు ఎన్నో మెట్లు పైకి ఎదగడానికి సాయం చేసింది' అని తన ప్రయాణంలో చేయూతనిచ్చిన ప్రతిఒక్కరినీ యాసిన్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

లాయర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టిన రెండో ఏడాదే మెజిస్ట్రేట్‌గా నియమితులవ్వడం సాధారణ విషయం కాదు. ఎంతో కఠోరదీక్ష కావాలి. ఈ కల చాలామందికి ఉంటుంది. కానీ యాసిన్ లాంటి వారు మాత్రమే దాన్ని చేరుకుంటారు. అయితే ఈ విజయం పట్ల యాసిన్ ఏమనుకుంటున్నారో ఆయన మాటల్లోనే తెలుసుకుందాం. 'ఇక్కడితో నా గమ్యం పూర్తవ్వలేదు. జీవితం ఎన్నో సవాళ్లని మన ముందుంచుతుంది. అయితే నేను బలంగా ఒక్కటి నమ్ముతాను. నిన్నటి కంటే ఈ రోజు చాలా బాగుంటుంది' అంటున్న యాసిన్ 'అణగారిన వర్గాల కోసం పనిచేస్తాన'ని ప్రతిజ్ఞ చేశారు. 'ఎన్నో సవాళ్ల మధ్య జీవించిన నేను వారి బాగు కోసం నిరంతరం కష్టపడతాను' అంటున్నారు.



చలికాలం 'చియా'

వేసవిలో 'చియా విత్తనాలు' ఆరోగ్యానికి మంచి చేస్తాయని అందరికీ తెలుసు. అయితే, చలికాలంలోనూ 'చియా సీడ్స్' తీసుకోవడం మంచిదేనని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. 'చియా వాటర్'తో శీతకాలపు సమస్యలకు చెక్ పెట్టొచ్చని చెబుతున్నారు.

సాధారణంగా చల్లటి వాతావరణంలో నీళ్లు తక్కువగా తాగుతుంటారు. ఫలితంగా శరీరం డీహైడ్రేషన్‌కు గురై జీర్ణక్రియ మందగిస్తుంది. ఈ రెండు సమస్యలకూ 'చియా సీడ్స్' చక్కని పరిష్కారం చూపుతాయి.

- ఒక గ్లాస్ నీటిలో రెండుమూడు టేబుల్ స్పూన్ల చియా విత్తనాలు వేసి.. రాత్రంతా నానబెట్టాలి. ఆ నీటిని ఉదయం పరగడుపునే తాగితే.. శరీరం రోజంతా హైడ్రేటెడ్‌గా ఉంటుంది. పీచు పదార్థం పుష్కలంగా లభించి.. జీర్ణక్రియ ఆరోగ్యం మెరుగుపడుతుంది. మలబద్ధకం నుంచీ ఉపశమనం లభిస్తుంది.
- చలికాలంలో చర్మ సమస్యలు ఎక్కువగా వేధిస్తుంటాయి. చియా విత్తనాల్లో ఉండే యాంటి ఆక్సిడెంట్లు చర్మం తేమను కోల్పోకుండా కాపాడుతాయి.
- చర్మ సమస్యలను దూరం చేయడంతోపాటు చర్మంపై మచ్చలను తగ్గించేందుకూ ఈ విత్తనాలు సాయపడతాయి. ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు చర్మ సంరక్షణలో ముందుంటాయనీ, చర్మం పొడిబారడాన్ని తగ్గిస్తాయని జర్నల్ ఆఫ్ డెర్మటోలాజికల్ సైన్స్ పరిశోధన చెబుతున్నది.
- చియా గింజల్లో యాంటి ఆక్సిడెంట్లు ఎక్కువ. ఇవి ఫ్రీ రాడికల్స్ నుంచి శరీరాన్ని రక్షించడంలో సాయపడతాయి. ఇందులోని యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి క్యాన్సర్ లక్షణాలు కణాల నష్టాన్ని నివారిస్తాయి.
- ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అంటే మనకు సాల్మన్ చేపలు గుర్తొస్తాయి. కానీ, వాటిలో కంటే ఎక్కువగా చియా విత్తనాల్లోనే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ లభిస్తాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో, వాపును తగ్గించడంలో, మెదడు పనితీరును మెరుగుపరచడంలో కీలకంగా వ్యవహరిస్తాయి.
- క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలోనూ ముందుంటాయి.

యాంటి ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్‌తో కూడిన చియా విత్తనాలు శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. జలుబు, దగ్గు, ఫ్లూ వంటి వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడటంలో కీలకంగా పనిచేస్తాయి.



'కన్నప్ప' మోహన్‌లాల్

మంచు విష్ణు తెరకెక్కిస్తోన్న 'కన్నప్ప' చిత్రం నుండి తాజాగా మోహన్‌లాల్ లుక్ విడుదలచేశారు. ఈ చిత్రంలో ఆయన కిరాటా పాత్రలో కనిపించనున్నారు. ఈ మూవీకి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తోన్న ఈ చిత్రంలో ప్రభాస్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ లాంటి భారీ తారాగణం నటిస్తున్నారు. ఓ యథార్థ కథ ఆధారంగా రూపొందుతోన్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 25, 2025లో థియేటర్లలో సందడి చేయనుంది.



పుష్ప2 'ఫీలింగ్స్' సాంగ్ వీడియో విడుదల

అల్లు అర్జున్–సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కిన సినిమా 'పుష్ప2'. ఈ చిత్రం సాంగ్స్, ట్రైలర్, కలెక్షన్స్ ఇలా అన్నింటిలోనూ పలు రికార్డ్స్ సొంతం చేసుకుంది. తాజాగా ఈ చిత్రం నుంచి ఫీలింగ్స్ వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. సోషల్‌మీడియాలో ఈ పాట సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. ఇప్పటికే మిలియన్ల కొద్ది రీల్స్ కూడా ఇన్‌స్టాలో వైరల్ అవుతున్నాయి. అల్లు అర్జున్, రష్మిక మందన్న స్టెప్పులకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ఇచ్చారు. ఈ పాటను చంద్రబోస్ రచించగా తెలుగులో (శంకర్ బాబు, లక్ష్మీ దాసా), హిందీలో (జావేద్ అలీ, మధుబంతీ), తమిళంలో (సెంథిల్ గణేశ్, రాజలక్ష్మి) మలయాళంలో (ప్రణవమ్ శశి, సితార కృష్ణకుమార్) కన్నడలో (సంతోశ్ వెంకీ, అమల) ఆలపించారు.



18న 'శిశిరం' పాటలు విడుదల

శ్రీకృష్ణ ఆర్ట్స్ బ్యానర్‌పై దర్శకుడు కనపర్తి రత్నాకర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'శిశిరం'. డాక్టర్ రావిపాటి వీరనారాయణ సమర్పణలో అమిర్నేని ప్రసాద్, సాదు చలపతి, కన్నెగంటి రవి, మూకిరి అనిల్ సహ నిర్మాతలు. బాలనటులు మాస్టర్ భాను, మాస్టర్ పుష్కర్లు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. బి.వెంకట్, వసంత యామిని, అయినాల మల్లేశ్వరరావు, కనపర్తి మధుకర్, అజయ్ ఇండియన్, గోము, మాస్టర్ రిత్విక్ సూరజ్, దిలీప్ సాయి, ప్రదీప్ సాయి, ఎం.జాశ్విక్ జ్ఞానానంద్ కృష్ణ, బి.అభిషేక్, చిరంజీవి ప్రీహాస్, చిరంజీవి స్రుణిసాయి తదితరులు నటిస్తున్నారు. సంగీతం శాండీ అద్దంకి, సాహిత్యం సురేంద్ర రొడ్డ, గానం టి.భవ్య, డిఒపి మురళీ, ప్రొడక్షన్ ఎం.శ్రీకాంత్, సహ దర్శకుడిగా రమణ, సినిమాటోగ్రాఫర్ డి.మధు, ఎస్ఎస్ వి శేఖర్. ఆదిత్య మ్యూజిక్ ద్వారా పాటలను విడుదల చేస్తున్నామని దర్శకుడు రత్నాకర్ తెలిపారు. బుధవారం నాడు పోస్టర్‌ను విజయవాడలో ఏపి టివి, స్టేజ్ అండ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ శ్రీనివాసనాయక్ ఆవిష్కరిస్తారని తెలిపారు.

ప్రభాస్‌కు మళ్లీ గాయం



వరుసగా సినిమాలతో బిజీగా ఉన్న నటుడు ప్రభాస్‌కు మరోసారి షూటింగ్‌లో గాయమైంది. గతేడాది 'సలార్', ఈ ఏడాది 'కల్కి 2898 ఏడీ' చిత్రాలతో 2898 ఏడీ' చిత్రాలతో బ్లాక్‌బస్టర్‌ను ఆయన అందుకున్నారు. ప్రస్తుతం రాజాసాబ్, ఫౌజీ (వర్కింగ్ టైటిల్) మూవీస్ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. సినిమా షూటింగ్ చిత్రీకరణలో ఆయనకు గాయాలయ్యాయి. ఈ విషయాన్ని ప్రభాస్ స్వయంగా ప్రకటించారు. బాహుబలి తర్వాత నుంచి ప్రభాస్ తన సినిమాలను జపాన్‌లోనూ విడుదల చేస్తున్నారు. జనవరి 3న 'కల్కి' జపాన్‌లో విడుదల చేయనున్నట్లుగా కొద్దిరోజుల క్రితం ప్రకటించారు. ఈ సినిమా ప్రీమియర్ కోసం ప్రభాస్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం గాయం కావటంతో జపాన్ రాలేక పోతున్నానని జపనీస్ భాషలో ప్రభాస్ రాసిన లెటర్ వైరల్ అవుతోంది. గతంలో పలుమార్లు షూటింగ్‌ల్లో ప్రభాస్‌కు గాయాలయ్యాయి. రాజాసాబ్ ఏప్రిల్ 10న విడుదల చేస్తామని ఇప్పటికే మేకర్లు ప్రకటించారు. దీని తర్వాత సందీప్‌రెడ్డి వంగా స్పిరిట్ మూవీ ప్రారంభం కానుంది.

కష్టాల్లో టీమిండియా

- భారత్–51/4
- వర్షం అడ్డంకి
- ఆస్ట్రేలియా 445ఆలౌట్

బ్రిస్బేన్: మూడో టెస్టులో టీమిండియా కష్టాల్లో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాను 445పరుగులకు ఆలౌట్ చేసిన భారత్.. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్‌లో మూడోరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్ల నష్టానికి 51పరుగులు చేసింది. మూడోరోజు ఆటకు పలుమార్లు వర్షం అంతరాయంగా నిలిచింది. వర్షం వల్ల ఆట నిలిచిపోయే సమయానికి ఇండియా నాలుగు వికెట్లు కోల్పోయి 51 రన్స్ చేసింది. ఆసీస్ పేస్ అటాక్ ముందు.. భారత బ్యాటర్లు చేతులెత్తేశారు. జైస్వాల్ 4, గిల్ 1, కోహ్లి 3, పంత్ 9 రన్స్ చేశారు. అంతకముందు ఆస్ట్రేలియా ఇవాళ ఉదయం 40 రన్స్ జోడించి 445 రన్స్‌కు ఆల్ అవుట్ అయ్యింది. భారత బౌలర్లలో బుమ్రా అద్భుతంగా బౌల్ చేశాడు. 76 రన్స్ ఇచ్చి అతను ఆరు వికెట్లు తీసుకున్నాడు. ఆసీస్ బ్యాటర్ అలెక్స్ క్యారీ 88 బంతుల్లో 70 రన్స్ చేశాడు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్.. సెంచరీలు చేసిన విషయం తెలిసిందే. రెండో సెషన్‌లో వర్షం రావడంతో ఆట నిలిచిపోయింది. మళ్లీ టీ బ్రేక్ తర్వాత కేవలం 17 బంతులే ఆడిన తర్వాత వర్షం వచ్చింది. లైట్ కూడా డిమ్‌గా ఉండడంతో.. ఆటను రద్దు చేశారు. భారత బ్యాటర్లలో కేఎల్ రాహుల్ ఒక్కడే స్థిరంగా ఆడాడు. ఆస్ట్రేలియా పేస్ అటాక్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. మిగితా టాప్ ఆర్డర్ బ్యాటర్లు ఎవరూ క్రీజ్‌లో నిలదొక్కుకోలేకపోయారు. మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్ వేగం ముందు భారత బ్యాటర్లు తేలిపోయారు. మేటి బ్యాటర్ కోహ్లి కూడా ఈజీగా చిక్కేశాడు. భారత్ ఇంకా 394 పరుగులు



వెనుకబడి ఉన్నది.

వరుణుడు అడ్డంకి...

ఆదివారం మ్యాచ్ ముగిసిన తర్వాత బ్రిస్బేన్‌లో వర్షం పడింది. దీంతో సోమవారం ఉదయం మైదానం చిత్తడిగా మారడంతో తొలి సెషన్ ఆట ఆలస్యంగా ప్రారంభమైంది. ఓవర్ నైట్‌స్కోర్ 7 వికెట్ల నష్టానికి 405పరుగులతో మూడో రోజు ఆట ప్రారంభించిన ఆసీస్ మరో 40 పరుగులు జోడించింది. మిచెల్ స్టార్క్ (18), అలెక్స్ కేరీ దూకుడుగా ఆడారు. అయితే బుమ్రా చక్కటి బంతితో స్టార్క్‌ను ఔట్ చేశాడు. మళ్లీ వరుణుడు ఆటంకపరిచాడు. నాథన్ లైయన్(2) ఐదు ఓవర్లపాటు కాచుకున్నాడు. అతడిని సిరాజ్ బౌల్డ్ చేశాడు. ఇక చివర్లో వేగంగా ఆడేందుకు ప్రయత్నించిన కేరీని ఆకాశ్ దీప్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 445పరుగుల వద్ద ముగిసింది. జస్‌ప్రీత్ బుమ్రాకు ఆరు, సిరాజ్‌కు రెండు, నితీశ్ రెడ్డి, ఆకాశ్ దీప్ తలో వికెట్ తీశారు.

బుమ్రా ఖాతాలో రెండు రికార్డులు..

ఆస్ట్రేలియాపై అత్యధిక టెస్ట్ వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. ఉమేశ్ యాదవ్ (17 మ్యాచుల్లో 53 వికెట్లు) ముందున్నాడు. మాజీ దిగ్గజ క్రికెటర్ కపిల్ 51 వికెట్లతో ఉన్నాడు. అయితే, బుమ్రా కేవలం 10 టెస్టుల్లోనే 50కు పైగా వికెట్ల మార్క్‌ను దాటాడు. గబ్బా వేదికపై అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన భారత బౌలర్‌గా మారాడు. ఎర్రాపల్లి ప్రసన్న (6/104)ను బుమ్రా అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో బుమ్రా 78 పరుగులకు ఆరు వికెట్లు తీశాడు.

స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 445ఆలౌట్

ఇండియా తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)మిఛెల్ మార్ష్ (బి)స్టార్క్ 4, కెఎల్ రాహుల్ (బ్యాటింగ్) 33, గిల్ (సి)మిఛెల్ మార్ష్ (బి)స్టార్క్ 1, కోహ్లి (సి)క్యారీ (బి)హేజిల్‌వుడ్ 3, పంత్ (సి)క్యారీ (బి)కమిన్స్ 9, రోహిత్ శర్మ (బ్యాటింగ్) 0, అదనం 1. (17 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 51పరుగులు.

వికెట్ల పతనం: 1/4, 2/6, 3/22, 4/44

బౌలింగ్: స్టార్క్ 8–1–25–2, హేజిల్‌వుడ్ 5–2–17–1, కమిన్స్ 2–0–7–1, లియాన్ 1–0–1–0, హెడ్ 1–0–1–0

అభిషేక్, ప్రణీత్ అగ్రస్థానం

జాతీయ ఆర్చరీ ఛాంపియన్‌షిప్స్

న్యూఢిల్లీ: జాతీయ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అభిషేక్ వర్మ–ప్రణీత్ కౌర్ సత్తా చాటారు. కాంపౌండ్ పురుషుల, మహిళల ర్యాంకింగ్స్ రౌండ్‌లో వీరు అగ్రస్థానంలో నిలిచారు. ఈ క్రమంలో అభిషేక్ వర్మ 714పాయింట్లతో జాతీయ రికార్డును సమం చేయగా.. మహిళల విభాగంలో వెన్నం జ్యోతి సురేశ(709) పేర ఉన్న రికార్డు పదిలంగా ఉంది. మహిళల విభాగంలో ప్రణీత్ కౌర్, మధుర 355పాయింట్లతో సమంగా ఉన్న క్రమంలో.. ఫలితం కోసం పర్ఫెక్ట్ టెన్‌ను నిర్దేశించగా.. ప్రణీత్ 59పాయింట్లతో విజయం సాధించగా... మధుర 2వ స్థానానికి పరిమితమైంది. తొలిరోజు పోటీలు ముగిసేసరికి పురుషుల వ్యక్తిగత విభాగంలో అభిషేక్ వర్మ(ఢిల్లీ) 714 అగ్రస్థానంలోఉండగా.. కుందేరు వెంకటాద్రి(సర్వీసెస్(710 పాయింట్లు), ప్రథమేశ్(707పాయింట్లు) రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. మహిళల విభాగంలో ప్రణీత్(పంజాబ్) 707పాయింట్లు అగ్రస్థానంలో నిలువగా.. మధుర(మహారాష్ట్ర) 707పాయింట్లు, జస్వీర్ కౌర్(రైల్వేస్) 703పాయింట్లు రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు.

అదరగొట్టిన ఢిల్లీ

ప్రొ కబడ్డీ సీజన్–11



పూణే: ప్రొ కబడ్డీ సీజన్–11లో దబాంగ్ ఢిల్లీ అదరగొట్టింది. సోమవారం బెంగాల్ వారియర్స్‌తో జరిగిన ఏకపక్ష పోటీలో ఢిల్లీ 47–25 పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఢిల్లీ రైడర్ ఆశు మాలిక్(17) సత్తా చాటగా.. ట్యాకిల్స్‌లో యోగేశ్(9), ఆశీశ్(5) మెరిసారు. ఆ జట్టు ఏకంగా నాలుగుసార్లు దబాంగ్ ఢిల్లీని ఆలౌట్ చేయగా.. ట్యాకిల్స్ ద్వారా 19, రైడ్‌ల ద్వారా 22పాయింట్లు సాధించింది. ఇక బెంగాల్ జట్టులో విశ్వాస్(8) ట్యాకిల్స్‌లో రాణిస్తే.. ఫజల్(4) ట్యాకిల్స్‌లో మాత్రమే రాణించాడు. ఇక రైడ్‌ల ద్వారా 12, ట్యాకిల్స్ ద్వారా 13పాయింట్లను బెంగాల్ జట్టు సాధించింది. ఈ గెలుపుతో దబాంగ్ ఢిల్లీ నాకౌట్ బెర్త్‌ను దాదాపు ఖాయం చేసుకుంది. ఢిల్లీ జట్టు 19మ్యాచుల్లో 66పాయింట్లతో 2వ స్థానానికి ఎగబాకింది.

ప్రొ కబడ్డీలో నేడు...
హర్యానా స్టీలర్స్ × యుపి యోధా (రాత్రి 8.00గం॥లకు)
జైపూర్ పింక్ ప్యాంథర్స్ × బెంగళూరు బుల్స్ (రాత్రి 9.00గం॥లకు)

ఇంగ్లండ్ లక్ష్యం 658పరుగులు

న్యూజిలాండ్‌తో మూడో టెస్ట్

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ జట్టు ఇంగ్లండ్ ముందు 658 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. న్యూజిలాండ్ జట్టు సీనియర్ బ్యాటర్ విలియమ్సన్(156), మిఛెల్ (60) రాణించడంతో రెండు ఇన్నింగ్స్‌లో 453పరుగులకు ఆలౌటైంది. దీంతో ఇంగ్లండ్ ముందు 658పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. నాల్గోరోజు ఆట ముగిసే సరికి ఇంగ్లండ్ 2 వికెట్ల నష్టానికి 18పరుగులు చేసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68